


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 193, పేజీలు - 08
గురువారం, డిసెంబర్ 25, 2025 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## ప్రభుత్వానికి, జర్నలిస్టులకు
# వారధిలా ఉంటాం

### - మూడు జర్నలిస్టుల సంఘాల అత్యవసర సమావేశం
### - 27న రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వం సోమవారం జారీ చేసిన జీవో 252 గురించి మూడు జర్నలిస్టుల సంఘాలు అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి అటు జర్నలిస్టులకు, ఇటు ప్రభుత్వానికి మధ్య వారధిలాగా వ్యవహరించాలని నిర్ణయించాయి. ఈ సమావేశంలో అఖిల భారత వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(ఎడబ్ల్యూజెఎ), తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టి.డబ్ల్యూజెఎఫ్), తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం (టిజేఎస్ఎస్) ప్రతినిధులు పాల్గొన్నారు. కే.కోటేశ్వర్ రావు, మామిడి సోమయ్య, అనంచిన్ని వెంకటేశ్వరరావులు ఈసమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాల గురించి వెల్లడించారు. ఈనెల 27న హైదరాబాద్ లో ఒక రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి, అందులో అన్ని జర్నలిస్టుల సంఘాల ప్రతినిధులను కలుపుకొని ముందుకు సాగాలని వారు నిర్ణయించారు.ప్రభుత్వం ఇక నుంచి రెండు రకాలైన కార్డులిస్తామని నిర్ణయం తీసుకోవడం జర్నలిస్టులను అయోమయానికి గురిచేస్తోందని, ఈ అక్రెడిటేషన్ కార్డు, మీడియా కార్డుల వలన వనగూరే ప్రయోజనాలను స్పష్టంగా పేర్కొనలేదని వారు తెలిపారు. అక్రెడిటేషన్ కార్డు ప్రభుత్వ సమాచారాన్ని సేకరించేందుకు రిపోర్టర్లకు గుర్తింపుగా ఉపయోగపడుతుందని, డెస్క్ జర్నలిస్టులు మీడియా కార్డును కేవలం సంక్షేమ పథకాలకు మాత్రమే వాడుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొనటం వారు సరికాదన్నారు. తొలిసారిగా డిజిటల్ న్యూస్ మీడియాకు అక్రెడిటేషన్ కార్డులివ్వనున్నారు. అది కూడా వెబ్సైట్లకు మాత్రమేనని స్పష్టంచే శారు. ఈ కొత్త నిబంధనలతో అక్రెడిటేషన్ కార్డులకు భారీగా కోతపడుతుందని వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో 23 వేల కార్డులివ్వగా, కొత్త జీవోతో అవి 10 వేలకు పైగా కార్డులకు కోత పడే ప్రమాదం ఉన్నదని వారు ఆందోళన వ్యక్తం చేశారు.డూప్లికేట్ కార్డు ఫీజు రూ.250కి పెంచారుమని, పైగా కార్డు కోల్పోతే పోలీసు ఎఫ్ఐఆర్ తప్పనిసరి చేయటం కూడా సరికాదని వారు పేర్కొన్నారు. గతంలో నియోజకవర్గ స్థాయిలో




రిపోర్టర్లకు ఒక కార్డు ఉండేది. ఇప్పుడు అది రద్దు చేశారని, స్టేట్, జిల్లా, మండలస్థాయిలో మాత్రమే కార్డులిస్తారని దీనిపై ప్రభుత్వంతో చర్చించాలని వారు తెలిపారు. గతంలో జనరల్, స్పోర్ట్స్, కల్చరల్, ఫిల్మ్, కార్టూనిస్టులకు ప్రత్యేక కోటా ఉండేదని. ఇప్పుడీ కోటాను రద్దుచేసి, ఫ్రీలాన్స్ కోటాలో అదీ కార్టూనిస్టులకే పరిమితం చేశారని దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని వారు కోరారు.రాష్ట్రస్థాయి అక్రెడిటేషన్ కు డిగ్రీ విద్యార్హత లేదా ఐదేండ్ల అనుభవం ఉండాలి. జిల్లా, మండలస్థాయి రిపోర్టర్లకు ఇంటర్మీడియట్ విద్యార్హత తప్పనిసరి. వీరి అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోలేదని, గతంలో ఆటో డ్రైవర్లకు, సర్పంచ్ లకు, పార్టీ కార్యకర్తలకు ఇచ్చే విధానాలకు ప్రభుత్వం స్వస్తి పలకాలని వారు కోరారు ఇది వరకు పట్టణ ప్రాంతాలు, మండలాల్లో 50 వేల జనాభాకు ఒక కార్డు చొప్పున ఇచ్చేవారు. కానీ ఇప్పుడు మండలానికి ఒక కార్డు మాత్రమే ఇస్తారని ఆ జీవోలో పేర్కొనటం సరికాదన్నారు.

కేబుల్ చానళ్లకు జిల్లా స్థాయిలో ఇచ్చే కార్డులను రద్దుచేశారు. ఇది వరకు జిల్లా స్థాయిలో కార్డులిచ్చేవారని, ఈ కార్డులతో ఎలాంటి ప్రత్యేక హోదా ఉండదని. కేవలం జర్నలిజం కోసం మాత్రమే వాడాలని, విజిటింగ్ కార్డులు, లెటర్ హెడ్స్ పై'అక్రెడిటేటెడ్ టు ది గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ' అన్న పదాలు వాడరాదని.మ, ముద్రించరాదని పేర్కొనటం వారు సరికాదన్నారు.

## మహా రాజకీయాల్లో
# సంచలనం
### - చేతులు కలిపిన థాక్రే బ్రదర్స్



ముంబై (ప్రశ్న న్యూస్) మహారాష్ట్ర రాజకీయాల్లో గత రెండు దశాబ్దాలుగా ఉప్పు-నిప్పులా ఉన్న థాకరే సోదరులు ఉద్ధవ్ థాకరే (శివసేన యూబీటీ) , రాజ్ థాకరే (ఎంఎన్ఎస్) ఇప్పుడు ఒకే బాట పట్టడం రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. 2025లో జరగనున్న ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఎన్నికలే లక్ష్యంగా వీరిద్దరూ చేతులు కలపడం ఇప్పుడు అధికార ఏకనాథ్ షిండే వర్గానికి , బీజేపీకి పెద్ద సవాలుగా మారింది. ముఖ్యంగా శివసేన పేరు, గుర్తు షిండే వర్గం చేతుల్లోకి వెళ్లిన తరవాత థాకరే వారసత్వాన్ని కాపాడుకోవడమే ఈ సోదరుల ప్రధాన అజెండాగా కనిపిస్తోంది. శివసేనలో చీలిక తర్వాత ఏకనాథ్ షిండే ముఖ్యమంత్రి కావడమే

2లో..

## కారు గుర్తు లేని సర్పంచ్ ఎన్నికల్లోనే
# 4 వేల స్థానాల్లో గెలిచాం

- ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పెట్టాలంటే రేవంత్ కు వణుకు అన్న హరీశ్ రావు
- పంచాయతీ ఎన్నికల్లో కూడా ముఖ్యమంత్రి ప్రచారం చేశారన్న హరీశ్ రావు
- 90 శాతం వరకు గెలవాల్సిన అధికార పార్టీ 64 శాతమే గెలిచిందన్న మాజీ మంత్రి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గుర్తు లేని సర్పంచ్ ఎన్నికల్లోనే 4 వేలకు పైగా స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధించిందని, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పెడితే ప్రజలు బీఆర్ఎస్‌కే పట్టం కడతారని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ప్రజలు కారు గుర్తుకు ఓటేస్తారనే భయం కాంగ్రెస్ పార్టీని పట్టుకుందని అన్నారు. ఎన్నికలు పెట్టాలంటేనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గజగజ వణుకుతున్నారని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పెట్టాలని సవాల్ విసిరారు.

2లో..

## నేను తెలంగాణ
## ప్రజల బాణాన్ని
### - కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తాను తెలంగాణ ప్రజలు వదిలిన బాణాన్నని కల్వకుంట్ల కవిత ప్రకటించారు. తనను ఎవరూ ఆదేశించలేరన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో జాగృతి జనం బాట పర్యటనలో భాగంగా మీడియాతో మాట్లాడారు. తన

2లో..

## రాజకీయాల్లో ఉన్నంత కాలం
# అధికారంలోకి రానివ్వను
### - కేసీఆర్‌కు రేవంత్ ఘాటు హెచ్చరికలు

- కొడంగల్ బిడ్డగా ఇదే గడ్డ మీది నుంచి చెబుతున్నానని సవాల్
- బీఆర్ఎస్ గతం కాంగ్రెస్ భవిష్యత్తు అన్న రేవంత్ రెడ్డి - చింతమడకలో చీరి చింతకు కడతామని వార్నింగ్
- కేసీఆర్ నన్ను జైలుకు పంపించి నా కుటుంబసభ్యులను ఇబ్బంది పెట్టాడని వ్యాఖ్య



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నేను రాజకీయాల్లో ఉన్నంత కాలం కల్వకుంట్ల ఫ్యామిలీని మళ్లీ అధికారంలోకి రానివ్వను అని సీఎం రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 80 శాతానికిపైగాసీట్లు సాధించి రెండో సారి అధికారంలోకి వస్తుందన్నారు. తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఎన్నికయిన సర్పంచ్ ఎన్నికల అభినందన సభలో పాల్గొన్నారు.

2లో..



## నింగిలోకి బాహుబలి రాకెట్

- శ్రీహరికోట నుంచి ప్రయోగించిన ఎల్వీఎం3-ఎం6 మిషన్ ఘన విజయం
- కక్ష్యలోకి చేరిన అత్యంత భారీ ఉపగ్రహంగా బ్లూబర్డ్ బ్లాక్-2 రికార్డు
- భారత వాణిజ్య అంతరిక్ష సామర్థ్యానికి అంతర్జాతీయ గుర్తింపు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఈరోజు విజయవంతంగా ప్రయోగించిన ఎల్వీఎం3-ఎం6 మిషన్‌పై దేశవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. అత్యాధునిక కమ్యూనికేషన్ ఉపగ్రహమైన బ్లూబర్డ్ బ్లాక్-2ను కక్ష్యలోకి చేర్చిన ఈ ప్రయోగాన్ని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తలు విజయవంతం చేశారు. ఈ ఘన విజయంపై ఏపీ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. భారత భూభాగం నుంచి ఇప్పటివరకు ప్రయోగించిన అత్యంత

2లో..

## పీపీపీ విధానంపై వెనక్కి తగ్గేదేలేదు

- పేదలకు నాణ్యమైన వైద్యం అందించడంలో రాజీ లేదన్న సీఎం
- పీపీపీ విధానంలోనే మెడికల్ కాలేజీల నిర్మాణమంటూ స్పష్టీకరణ
- వీజీఎఫ్ కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 30 శాతం ఆర్థిక సాయం



అమరావతి (ప్రశ్న న్యూస్) పేదలకు నాణ్యమైన వైద్య విద్య, వైద్య సేవలు అందించే విషయంలో ఎక్కడా రాజీపడేది లేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలోనే వైద్య కళాశాలల నిర్మాణం చేపడతామని, దీనిపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ఇవాళ వైద్యారోగ్య శాఖపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన కీలక

2లో..

## ఇచ్చిన మాట కోసం
## ఇప్పటంలో పవన్ కళ్యాణ్
### - వృద్ధురాలి ఫ్యామిలీకి ఆర్థిక సాయం



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ గుంటూరు జిల్లా ఇప్పటం గ్రామాన్ని సందర్శించారు. మూడేళ్ల క్రితం ఇచ్చిన హామీ మేరకు అక్కడ నివసిస్తున్న

2లో..

## మేడారం జాతరలో
# కీలక ఘట్టం
### - గద్దెలపైకి పగిడిద్దరాజు, గోవిందరాజులు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్క సారక్క జాతరకు తెలంగాణ ప్రభుత్వం శరవేగంగా ఏర్పాట్లు చేస్తోంది. వచ్చే ఏడాది జనవరిలో జరగనున్న ఈ మహా జాతర కోసం ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో

2లో..

## సర్పంచ్‌లకు తీపి కబురు
### - గ్రామాలకు ప్రత్యేకంగా రూ.10లక్షలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన కొత్త సర్పంచ్‌లతో నారాయణపేట జిల్లా కోస్గిలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారికి అభినందనలు తెలియజేశారు. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లను సన్మానించిన సీఎం రేవంత్ గ్రామాల అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. కొత్త ఏడాదిలో గ్రామాలకు ప్రత్యేక అభివృద్ధి నిధులను రాష్ట్ర ప్రభుత్వం తరఫు నుంచి మంజూరు

2లో..

# రాజకీయాల్లో ఉన్నంత కాలం అధికారంలోకి రానివ్వను

ఈ సందర్భంగా నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన కేసీఆర్ కుటుంబంపై నిప్పులు చెరిగారు. వచ్చే 2029 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టిస్తుందని రేవంత్ రెడ్డి జోస్యం చెప్పారు. "రాసిపెట్టుకోండి.. 2029లో 80 శాతానికి పైగా అసెంబ్లీ సీట్లతో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తుంది" అని ఆయన ఘంటాపథంగా చెప్పారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజలు పడ్డ కష్టాలను గుర్తు చేస్తూ, ఇందిరమ్మ రాజ్యం పదేళ్ల పాటు కొనసాగుతుందని, అప్పుడే రాష్ట్రానికి నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్ మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, వారి రాజకీయ అస్థిత్వానికి కాలం చెల్లిందని ఎద్దేవా చేశారు. తన పాలనపై కేసీఆర్, కేటీఆర్ చేస్తున్న విమర్శలను రేవంత్ రెడ్డి ఘాటుగా తిప్పికొట్టారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను పట్టించుకోని వారు, ఇప్పుడు అధికారం కోసం దొంగ దెబ్బ తీయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ప్రెస్‌మీట్‌లో కేసీఆర్ చేసిన ఆరోపణలపై స్పందించారు. తాను చనిపోవాలని పదే పదే కోరుకుంటున్నారని కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపైనా స్పందించారు. తాను ప్రమాణ స్వీకారం చేసిన రోజునే మంచం మీద నుంచి పడి మక్కెలు విరగ్గొట్టున్నారని, ఆయనను తాను ఏమీ అనలదేన్నారు. తోలు తీస్తానని కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై సెటైర్లు వేశారు. రెండేళ్ల పాటు ఫామ్‌హౌస్‌లో ఉండి తోలు తీయడం నేర్చుకున్నారని మటన్ కొట్టు మస్తాన్ వద్దకు రా అని వ్యాఖ్యానించారు. ఎవరి తోలు తీస్తారో తేల్చుకుందామని సర్పంచ్‌ల వద్దకు రావాలన్నారు. చింతమడకలో చీరి చింతకు కడతామని వార్నింగ్ ఇచ్చారు.నలభై ఏళ్ల అనుభవం ఉన్న మాటలు మాట్లాడే మాటలేని అవి అని కేసీఆర్ పైమండిపడ్డారు. మాకు మాటలు రాక కాదు, మర్యాద ఉండదని మాట్లాడటం లేదన్నారు. రియల్ ఎస్టేట్ బ్రోకర్ దందా అంటున్నాడు ఇదేం దుబాయ్ పాస్ పోర్ట్ బ్రోకర్ దందా కాదు నేనేం పాస్ పోర్టు బ్రోకర్ దందా చేయలేదు అయ్య పేరు చెప్పుకుని మంత్రి పదవి తీసుకోలేదు మేం కక్షా రాజకీయాలు చేయం ఎవరి పాపాన వాళ్లే పోతారని మా పని మేం చేసుకుంటున్నామన్నారు. పది మందిని వెనకేసుకుని పొంకనాలు కొట్టుడు కాదు అసెంబ్లీలో చర్చిద్దాం రా.. అని సవాల్ చేశారు. ఏ అంశంపై అయినా అసెంబ్లీలో చర్చించేందుకు మేం సిద్ధం అన్నారు. కాళేశ్వరంపై చర్చిద్దామా, కృష్ణా గోదావరి జలాలపై చర్చిద్దాం, టెలిఫోను ట్యాపింగ్ పై చర్చిద్దామా రండి అని పిలుపనిచ్చారు. సొంత చెల్లిలి భర్త ఫోన్ ట్యాపింగ్ చేశారని వాళ్ళింటి ఆడబిడ్డనే చెబుతోందన్నారు.కేసీఆర్ తరహాలో తాను మాట్లాడితే ఉరేసుకుంటాడాన్నారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు తనను జైలుకు పంపడమే కాక తన కుటుంబాన్ని ఇబ్బంది పెట్టాడన్నారు. అయినా ఆయన పాపానికి ఆయనే పోతామని వదిలేశామన్నారు. కేసులు కూడా పెట్టలేదని కక్ష సాధింపులకు పాల్పడలేదన్నారు. మా వాళ్ల మంత్రులు, ఎమ్మెల్యేలు ఎన్నో పాపాలు చేశారని గుర్తు చేశారు. తానేమీ దుబాయ్ పాస్ పోర్టుబ్రోకర్ గా చేయలేదని రియల్ ఎస్టేట్ దందాలు చేయలేదని రేవంత్ గుర్తు చేశారు. తండ్రీ,కొడుకులు కల్లు కాంపౌండ్ మాటలు మానేసి పార్టీ ఆఫీసులో కాదని అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని సవాల్ చేశారు. కేటీఆర్ పైనా రేవంత్ రెడ్డి విరుచుకుపడ్డారు.

తండ్రి గాలికి సంపాదించిన ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందనే కవితను ఇంట్లో నుంచి వెళ్లగొట్టారని మండిపడ్డారు. సొంత బిడ్డకు చీరపెట్టని వాడు చెల్లి ప్రశ్నలకు సమాధానాలు చెప్పేలని వాడు తనకు సవాల్ చేస్తున్నారని అన్నారు. కేసీఆర్ ఉడత ఊపులకు భయపడేవాడ్నికాదని ఎన్ని సార్లు అయినా అసెంబ్లీ పెడతామని సవాల్ చేశారు. "ప్రజల ఆశీర్వాదం ఉన్నంత వరకు నన్ను ఎవరూ ఏమీ చేయలేరు. కొడంగల్ బిడ్డగా నేను చెబుతున్నా కేసీఆర్ ఫ్యామిలీ రాజకీయ కనుమరుగు కావడం ఖాయం" అని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ, స్థానిక సంస్థల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని హామీ ఇచ్చారు.

# మహా రాజకీయాల్లో సంచలనం

కాకుండా, పార్టీపై పూర్తి పట్టు సాధించారు. అయితే, ముంబైలోని మరాఠీ ఓటర్లలో ఇప్పటికీ ఉద్ధవ్ థాకరే పట్ల కొంత సానుభూతి ఉంది. మరోవైపు రాజ్ థాకరేకు కూడా గ్రేటర్ ముంబై పరిధిలో చెప్పుకోదగ్గ ఓటు బ్యాంకు ఉంది. ఈ ఇద్దరూ విడివిడిగా పోటీ చేయడం వల్ల ఓట్లు చీలిపోయి షిండే-బీజేపీ కూటమికి లబ్ధి కలుగుతోందని గుర్తించిన సోదరులు, ఇప్పుడు ఐక్యంగా ముందుకు సాగాలని నిర్ణయించుకున్నారు. వీరిద్దరూ కలిసి పోటీ చేస్తే ముంబైలోని కనీసం 70-80 వార్డుల్లో ఫలితాలను తలకిందులు చేయగలరని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.ఈ కలయిక వెనుక ఉద్ధవ్ శివసేన కీలక నేత సంజయ్ రౌత్ కృషి ఎంతో ఉంది. ఇటీవల ఆయన రాజ్ థాకరేతో సమావేశమై సీట్ల సర్దుబాటు, ఉమ్మడి ప్రచార వ్యూహాలపై చర్చించారు. ముంబై నగరంపై థాకరే ముద్ర మళ్లీ పడాలి, మన శత్రువు ఒక్కరే అనే నినాదంతో కేడర్‌ను సమాయత్తం చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని మున్సిపల్ కౌన్సిల్ ఎన్నికల్లో వీరి మధ్య అవగాహన కుదిరింది. శివసేన ఇప్పటికే ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోయిందన్న ఆవేదన ఇటు శివసైనికుల్లోనూ, అటు థాకరే కుటుంబంలోనూ ఉంది. అసలైన శివసేన ఎక్కడ ఉన్నా, అసలైన రక్తసంబంధం మా మధ్యే ఉంది అని ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా మరాఠీ భావోద్వేగాలతో బలం పుంజుకోవాలని వీరు భావిస్తున్నారు. శివసేన వ్యవస్థాపకుడు బాల్ థాకరే ఆశయాలను కాపాడేది తామేనని నిరూపించుకోవడానికి బీఎంసీ ఎన్నికలను వీరు ఒక వేదికగా మలుచుకుంటున్నారు. థాకరే సోదరులు ఒక్కటైనా, ఉద్ధవ్ థాకరే ఇప్పటికే కాంగ్రెస్, శరద్ పవార్ ఎన్సీపీలతో కూడిన 'మహా వికాస్ అఘాడి' (ఎంవీఏ)లో ఉన్నారు. రాజ్ థాకరే కూటమిలోకి వస్తే కాంగ్రెస్ తన వైఖరిని ఎలా మార్చుకుంటుందనేది పెద్ద ప్రశ్న. అయితే, ముంబై రాజకీయాల్లో ఉనికి చాటుకోవాలంటే సిద్ధాంతాల కంటే వ్యూహాలే ముఖ్యమని వీరు భావిస్తున్నారు. ఒకవేళ బీఎంసీలో థాకరే సోదరుల కూటమి సక్సెస్ అయితే, అది మహారాష్ట్ర రాజకీయాల్లో ఒక కొత్త శకానికి నాంది కానుంది. ముంబైని తమ గుప్పిట్లోకి తీసుకోవాలని చూస్తున్న ఏకనాథ్ షిండేకు, థాకరే సోదరుల ఈ ఐక్యత గట్టి అడ్డుగోడగా మారే అవకాశం ఉందన్న అంచనాలు వినిపిస్తున్నాయి.

## తీగుల్ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

**సిద్దిపేట** జగదేవ్ పూర్ మండలంలోనీ తీగుల్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న మేజర్, మైనర్ రిపేర్లను పరిశీలించారు. వాటర్ కనెక్షన్, టాయిలెట్స్ లో ట్యాప్ లీకేజీలు చెక్ చేసుకోవాలని రిపేర్లు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణిత కాల వ్యవధిలో పూర్తి అయ్యేలా పని చేయించుకోవాలని మెడికల్ ఆఫీసర్ ను ఆదేశించారు. పిఎచ్ సి లోపల ఎల్లపుడు శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అటెండెన్స్ రిజిస్టర్ ఓపి రిజిస్టర్ వెరిఫై చేశారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించాలని మెడికల్ ఆఫీసర్ మరియు సిబ్బందిని ఆదేశించారు. ప్రాంగణం బయట చెత్త చెదారం పిచ్చి మొక్కలు తొలగించాలని గ్రామపంచాయతీ అధికారులను ఆదేశించారు.

## కాబోయే ప్రధాని ప్రియాంక గాంధి !...

**న్యూఢిల్లీ** వరుస ఓటములతో రాహుల్ గాంధీ పై కాంగ్రెస్ విశ్వాసం కోల్పోయిందని ఇప్పటికే బీజేపీ ఆరోపిస్తోంది కాగా, మంగళవారం రాబర్ట్ వాద్రా తన భార్య కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఎప్పటికైనా ప్రధాని అవుతుందన్న విశ్వాసం వ్యక్తం చేయడంతో తాజా చర్చకు తెరలేచింది. ఇందిరా గాంధీ మాదిరిగా పోలికలు ఉన్న ప్రియాంకను ప్రధానిగా చూడాలని చాలామంది కోరుకుంటున్నారని, ఇది కాలమే నిర్ణయించాలని రాబర్ట్ వాద్రా అన్నారు. ప్రియాంక తన నాన్నమ్మ మాదిరిగా బలమైన ప్రధానిగా నిరూపించుకుంటారని కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ చేసిన వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా రాబర్ట్ వాద్రా ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.రాజకీయాల్లో ప్రియాంకకు ఉజ్వల భవిష్యత్ ఉందని, ఈ దేశంలో క్షేత్రస్థాయిలో అవసరమైన మార్పులు తీసుకురాగలదని తాను భావిస్తున్నట్లు రాబర్ట్ వాద్రా పేర్కొన్నారు. ప్రియాంక తన బామ్మ ఇందిరాగాంధీ, తండ్రి రాజీవ్ గాంధీ, సోనియా, సోదరుడు రాహుల్ గాంధీ నుంచి చాలా నేర్చుకుందని తాను భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలలో ఆమె గుర్తింపు పొందారు. ఆమె ఏం మాట్లాడినా గుండె లోతులనుంచి సూటిగా మాట్లాడుతుంది. ప్రజలు ఆమె మాటలను ఇష్టపడుతున్నారని వాద్రా అన్నారు

## అన్నవరం కొండపై అమానుషం

- నాయి బ్రాహ్మణుడి నిర్లక్ష్యానికి చిన్నారి చెవి కట్
- భక్తితో వస్తే రక్తపాతమా? సత్యదేవుని సన్నిధిలో పసిపాపకు అన్యాయం
- తల్లి గుండె కోత.. పాప చెవి కోత! దేవస్థానం సిబ్బంది అహంకారానికి పరాకాష్ట.
- డబ్బులిస్తేనే సేవలా? లేదంటే గాయాలా? అన్నవరం సిబ్బందిపై భక్తుల ఆగ్రహం.
- కనీసం క్షమాపణ లేని కరుడుగట్టిన మనస్తత్వం..
- చిన్నారి గాయంపై అధికారుల మౌనం ఎందుకు?

పవిత్ర పుణ్యక్షేత్రం అన్నవరం సత్యదేవుని సన్నిధిలో విస్తుపోయే ఘటన చోటుచేసుకుంది. మొక్కు తీర్చుకునేందుకు వచ్చిన ఒక పసిపాపపై దేవస్థాన సిబ్బంది చూపిన నిర్లక్ష్యం భక్తులనుగ్భ్రాంతికి గురిచేసింది. తలనీలాలు సమర్పించే క్రమంలో అక్కడ పనిచేసే నాయి బ్రాహ్మణుడు అత్యంత అశ్రద్ధగా వ్యవహరించడంతో చిన్నారి చెవి తెగి రక్తం ధారకట్టింది. తన బిడ్డ పడుతున్న నరకయాతనను చూసి ఆ తల్లి విలవిలలాడిపోతుంటే, సదరు సిబ్బంది కనీసం కనికరం లేకుండా, క్షమాపణ కూడా చెప్పకుండా అహంకార పూరితంగా వ్యవహరించడం అక్కడి వారిని విస్మయానికి గురిచేసింది.మొక్కుల ముసుగులో భక్తుల నుండి అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉండగా, ఇప్పుడు ఏకంగా పసిపిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడటం చర్చనీయాంశంగా మారింది. 'డబ్బులిస్తేనే పని.. లేదంటే నిర్లక్ష్యం' అన్నట్టుగా సాగుతున్న ఈ పోకడలు భక్తుల భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఈ దారుణానికి ఒడిగట్టిన వ్యక్తిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, బాధ్యులైన వారిని విధుల నుంచి తొలగించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించి బాధితురాలికి న్యాయం చేయని పక్షంలో పెద్ద ఎత్తున నిరసనలు తప్పవని హెచ్చరిస్తున్నారు.కోరుతున్న డిమాండ్లు × బాధ్యుడైన వ్యక్తిని వెంటనే సస్పెండ్ చేయాలి. × సిబ్బంది ప్రవర్తనపై విచారణ జరిపించి, భక్తుల పట్ల మర్యాదగా ఉండేలా చర్యలు చేపట్టాలి. × చిన్నపిల్లల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకునేలా నిబంధనలు కఠినదానం చేయాలి.

## అంతర్రాష్ట్ర చిన్నారుల అక్రమ రవాణా ముఠా గుట్టురట్టు

**గుజరాత్ నుంచి పసిపిల్లలను అక్రమంగా తీసుకొచ్చి**
**హైదరాబాద్, మంచిర్యాల ప్రాంతాల్లో లక్షల రూపాయలకు విక్రయం**

**హైదరాబాద్** ;సైబరాబాద్ పోలీసులు అంతర్రాష్ట్ర చిన్నారుల అక్రమ రవాణా ముఠా గుట్టురట్టు చేశారు. గుజరాత్ నుంచి పసిపిల్లలను అక్రమంగా తీసుకొచ్చి హైదరాబాద్, మంచిర్యాల ప్రాంతాల్లో లక్షల రూపాయలకు విక్రయిస్తున్న ముఠా సభ్యులను గుర్తించి అరెస్టు చేశారు. సైబరాబాద్ స్పెషల్ పోలీస్ టీమ్స్.. గుజరాత్‌కు చెందిన ఏజెంట్లతో సంప్రదింపులు జరుపుతూ ఈ అక్రమ రవాణా వ్యవహారాన్ని గుర్తించారు.యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో నిందితులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి పసిపిల్లలను రక్షించి సురక్షిత కేంద్రాలకు తరలించారు. ఈ వ్యవహారంలో కేసు నమోదుచేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ముఠాకు మరిన్ని లింకులు ఉన్నాయనే అనుమానంతో గుజరాత్ పోలీసులతో సమన్వయం చేస్తూ విచారణ చేపట్టారు. చిన్నారుల అక్రమ రవాణాకు సంబంధించి ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే 100 లేదా 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

## పుప్పాల్ గూడ లో రెచ్చిపోయిన ఓ రియల్ ఎస్టేట్ సంస్థ

**రంగారెడ్డి** పుప్పాల్ గూడలో ఒక రియల్ ఎస్టేట్ సంస్థ రెచ్చిపోయింది. మంగళవారం అర్ధరాత్రి సర్వే నెంబర్ 300 లోకి కొంతమంది ప్రవేశించి దౌర్జన్యం గా బోర్డులను తొలగించారు. రేకుల తో నిర్మించిన పహారీ గోడ ను జేసీబీ సహాయం తో ద్వంసం చేసారు. బౌంసర్ల సహాయంతో పట్టా పొలం కబ్జాచేసారు. రాత్రి కి రాత్రే రోడ్డు వేసారు. విషయం తెలుసుకొని యజమానులు పొలం వద్ద కు చేరుకున్నారు. అక్కడున్న బౌన్ సర్లు యజమానుల పై దాడికి దిగారు. వారి కళ్ల ముందే దౌర్జన్యం గా బోర్డులు, పహారీ గోడ నేలమట్టం చేసారు. బాధితులు 100 కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

నార్సింగి పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులను చూసి బౌంసర్లు పరారయ్యారు. కోర్టు లో కేసులు పెండింగ్ లో ఉండగా రియల్ ఎస్టేట్ సంస్థ బరి తెగిస్తుందని బాధితులు ఆరోపించారు. అడ్డుకుంటే రౌడీల తో దాడికి దిగుతున్నారంటూ అవేదన చెందారు. మా పేద వాళ్ళ వ్యవసాయ పొలం ను కబ్జా చేస్తున్నారంటూ వాపోయారు. ఓ నిర్మాణ సంస్థ వద్ద బౌంసర్లు ఎందుకని నిలదీసారు.

## ఇచ్చిన మాట కోసం ఇప్పటంలో పవన్ కళ్యాణ్

వృద్ధురాలు ఇండ్ల నాగేశ్వరమ్మను ఆయన కలిశారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న పవన్ కల్యాణ్, ఆప్యాయంగా ఆమెను ఆలింగనం చేసుకున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరమ్మకు రూ.50 వేల ఆర్థిక సహాయం అందిస్తానని, ఆమె మనవడి విద్య కోసం మరో రూ.లక్ష అందజేస్తానని పవన్ కల్యాణ్ ప్రకటించారు. అంతేకాదు తన జీతం నుంచి ప్రతి నెలా రూ.5 వేల సాయం చేస్తానని హామీ ఇచ్చారు. "నాలుగు రోజులుగా రావాలనుకున్నాను కానీ అధికారిక పనుల వల్ల వీలుకాలేదు. ఈరోజు మాత్రం మీకిచ్చిన మాట నిలబెట్టుకోవడానికి అన్ని పనులు వాయిదా వేసుకుని వచ్చాను" అంటూ పవన్ భావోద్వేగంగా మాట్లాడారు. 2022 నవంబర్‌లో పవన్ కల్యాణ్ ఇప్పటం గ్రామాన్ని సందర్శించిన సంగతి తెలిసిందే. జనసేన ఆవిర్భావ దినోత్సవ సభ కోసం భూములు ఇచ్చిన గ్రామస్తుల ఇళ్లు అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు విస్తరణ పేరుతో కూల్చివేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ సమయంలో నాగేశ్వరమ్మ పవన్ కల్యాణ్‌ను కలిసి, ఎన్నికల్లో గెలిచిన తర్వాత తన ఇంటికి రావాలని కోరగా ఆయన మాటిచ్చారు. 2024 ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో పవన్ కల్యాణ్ తన మాటను నిలబెట్టుకుంటూ ఇప్పటం గ్రామానికి వచ్చారు. ఇది ఆయన రాజకీయ జీవితానికి మాత్రమే కాదు, వ్యక్తిగత విలువలకు కూడా నిదర్శనంగా నిలిచిందని గ్రామస్తులు అంటున్నారు.

## మేడారం జాతరలో కీలక ఘట్టం

తాజాగా కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ఇందులో భాగంగా బుధవారం మేడారంలోని నూతన గద్దెలపై పగిడిద్దరాజు , గోవిందరాజులను ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం పూజారులు ప్రతిష్ఠించారు. మంత్రి సీతక్క సమక్షంలో జరిగిన ఈ వేడుకతో మేడారం పరిసరాల్లో జాతర వాతావరణం నెలకొంది. జనవరి 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరగనున్న మేడారం జాతర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.బుధవారం ఉదయం నుంచే మేడారంలో ఆధ్యాత్మిక సందడి మొదలైంది. పూజారులు తమ ఆచారాల ప్రకారం దేవమూర్తులను ప్రతిష్ఠించారు. తెల్లవారుజామున 6 గంటలకు గోవిందరాజు గద్దె ప్రతిష్ఠాపన జరిగింది. ఉదయం 9.45 గంటలకు పగిడిద్దరాజు గద్దెను పూజారులు శాస్త్రోక్తంగా కొలువుదీర్చారు. మంగళవారం రాత్రి నుంచే కొండాయి గ్రామం నుంచి వచ్చిన సమ్మక్క-సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల పూజారులు తమ కుటుంబాలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్వయంగా పాల్గొన్నారు. ఆమెతో పాటు జిల్లా కలెక్టర్ దివాకర, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, జాతర కార్యనిర్వహణాధికారి వీరాస్వామి, ఇతర అధికారులు హాజరయ్యారు. జాతర ఏర్పాట్లు సజావుగా సాగేలా చూడాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు. గద్దెలపై పగిడిద్దరాజు, గోవిందరాజుల ప్రతిష్ఠాపన కార్యక్రమం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసింది. భద్రతా కారణాల దృష్ట్యా ఈ కార్యక్రమం పూర్తయ్యే వరకు భక్తులను గద్దెల ప్రాంగణంలోకి అనుమతించలేదు. కేవలం పూజారుల కుటుంబ సభ్యులు, అధికారులను మాత్రమే లోపలికి పంపించారు. వచ్చే ఏడాది జనవరి నెలలో నాలుగు రోజుల పాటు ఈ మేడారం మహా జాతర జరగనుంది. జనవరి 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరిగే సమ్మక్క సారక్క మహా జాతర కోసం కోట్లాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో.. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే భారీగా నిధులు కేటాయించి, మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తోంది.

## సర్పంచ్‌లకు తీపి కబురు

చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నుంచి వచ్చే నిధులకు అదనంగా ప్రభుత్వం నుంచి నిధులు ఇవ్వనున్నట్లు సీఎం రేవంత్ తెలిపారు. పంచాయతీలకు సాధారణంగా అందే నిధులు కాకుండా ముఖ్యమంత్రి నిధి నుంచి స్పెషల్ డెవలప్‌మెంట్ నిధులను కేటాయిస్తామని ప్రకటించారు. అయితే చిన్న గ్రామాలకు ఒక్కొక్కదానికి రూ.5 లక్షలు పెద్ద పెద్ద గ్రామాలకు ఒక్కో దానికి రూ.10 లక్షలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు.ఈ నిధులకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులతో ఎలాంటి సంబంధం లేకుండా మంజూరు చేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లకు సీఎం కీలక సూచనలు చేశారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని హితవు పలికారు. దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలను పరిష్కించేందుకు ఈ ప్రత్యేక అభివృద్ధి నిధులను ఉపయోగించాలని పేర్కొన్నారు. గ్రామాలే భారతదేశానికి పునాదులు ఉన్నాయని మహాత్మా గాంధీ చెప్పారని గుర్తు చేసిన సీఎం రేవంత్.. గ్రామాలు డెవలప్ అయినపుడే దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. పేదలకు సంక్షేమ పథకాలు అందినప్పుడే నిజమైన పాలన అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు. ప్రతీ గ్రామం, తండాకు రోడ్లను వేస్తామని గ్రామ ప్రజల్లో నమ్మకాన్ని నిలబెట్టుకునేలా సర్పంచ్‌లు ప్రజా సేవలో నిమగ్నం కావాలని సూచించారు. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లను పార్టీలు చూడకుండా గ్రామాలను అభివృద్ధి చేయాలని ఇతర పార్టీ నుంచి గెలిచారనే వివక్ష ఎక్కడా ఉండొద్దని తేల్చి చెప్పారు. చిన్న చిన్న విభేధాలు, సమస్యలు ఉంటే వాటన్నింటినీ పక్కన పెట్టి అభివృద్ధిపై దృష్టి పెట్టాలని తెలిపారు.

## యేసుక్రీస్తు దీవెనలు ప్రతీ ఒక్కరిపై ఉండాలి

**- ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్**



ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది వేడుకలను ప్రభుత్వం నిర్వహించడం సంతోషంగా ఉంది. క్రైస్తవుల ఆరాధ్యుడు యేసుక్రీస్తు దీవెనలు ప్రతి ఒక్కరిపైన ఉండాలి. ఆయన ఆశీర్వాదంతో తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలి. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల మనోభావాలను గుర్తించి ప్రభుత్వం అధికారకంగా హిందు, ముస్లిం, క్రైస్తవుల పండుగలను అధికారికంగా నిర్వహిస్తోంది. ఆయా సామాజిక వర్గాల్లోని పేదలకు అవసరమైన సాయం అందిస్తూ ప్రతి కుటుబంలో పండుగ వాతావరణం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు. మంథని నియోజకవర్గం లోని అన్ని చర్చిలలో క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నామని ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్ తెలిపారు.

## కారు గుర్తు లేని సర్పంచ్ ఎన్నికల్లోనే 4 వేల స్థానాల్లో గెలిచాం

నర్సాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ దెబ్బకు రేవంత్ రెడ్డి ఎన్నికలంటేనే గజగజ వణుకుతున్నాడని ఎద్దేవా చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి కాలికి బలపం కట్టుకుని తిరిగినా ఫలితం లేదని అన్నారు. సాధారణంగా పంచాయతీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి ప్రచారం చేయరని, కానీ ఓడిపోతామనే భయంతో ఆయన ఊరూరా తిరిగాడని పేర్కొన్నారు.సాధారణంగా పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీకి 90 శాతం, వీలైతే 100 శాతం విజయాలు వస్తాయని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వానికి 64 శాతం ఫలితాలే వచ్చాయని ఆయన వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ 6 వేలకు పైగా సర్పంచ్?లు గెలిస్తే, బీఆర్ఎస్ 4 వేలకు పైగా గెలిచిందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో జిల్లా పరిషత్‌లు, 90 శాతం వరకు సర్పంచ్‌లు మనమే గెలిచామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ చచ్చిపోయిందనే రేవంత్ రెడ్డి నిద్రలో కూడా అదే పార్టీని కలవరిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ పేరు లేకుండా, కేసీఆర్ పేరు లేకుండా రేవంత్ రెడ్డి ఎప్పుడూ మాట్లాడలేదని వెల్లడించారు.

## నింగిలోకి బాహుబలి రాకెట్

భారీ ఉపగ్రహమిదేనని పేర్కొన్న ఆయన, ఈ మిషన్ దేశానికి మరో మైలురాయిగా నిలిచిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు కూడా 'ఎక్స్' వేదికగా ఇస్రో బృందాన్ని అభినందించారు. అత్యంత భారీ ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టడం ద్వారా భారత వాణిజ్య అంతరిక్ష సామర్థ్యం మరింత బలోపేతమైందన్నారు. ప్రపంచ స్థాయిలో విశ్వసనీయ లాంచ్ భాగస్వామిగా భారత్‌కు మరింత గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. రాష్ట్ర ఐటీ, హెచ్‌ఆర్‌డీ శాఖ మంత్రి నారా లోకేశ్ కూడా 'బాహుబలి'గా పేరుగాంచిన ఎల్వీఎం3 రాకెట్ విజయంపై శాస్త్రవేత్తలను ప్రశంసించారు. ఇది భారత వాణిజ్య ప్రయోగాల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన ఘట్టమని అన్నారు. ఇక వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ కూడా ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియజేశారు. ఈ విజయం భారత శాస్త్రీయ ప్రతిభకు నిదర్శనమని, దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు.

## నేను తెలంగాణ ప్రజల బాణాన్ని

రాజకీయ భవిష్యత్తు , బీఆర్ఎస్ పార్టీతో తనకున్న ప్రస్తుత సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. 19 ఏళ్లుగా జాగృతి ద్వారా ప్రజల్లోనే ఉన్నానని, 2029 ఎన్నికల్లో ఖచ్చితంగా బరిలో ఉంటానని ఆమె ప్రకటించారు. బీఆర్ఎస్ నుంచి తనను ఎందుకు సస్పెండ్ చేశారో ఇప్పటికీ కారణం తెలియదని, ఉరి వేసే వ్యక్తికి కూడా కారణం చెబుతారని, కానీ తనకు ఆ కనీస సమాచారం కూడా ఇవ్వలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన కొన్ని పొరపాట్లలో తాను కూడా భాగస్వామినేనని కవిత బహిరంగంగా అంగీకరించారు. ముఖ్యంగా నిజామాబాద్ ఎంపీగా ఉన్న సమయంలో ఆలేరు ప్రాంత రైతులపై బేడీలు వేసిన ఘటనపై ఆవేదన వ్యక్తంమ చేశారు. అప్పుడు నేను పార్టీలో ఉన్నాను కాబట్టి ఆ పాపంలో నాకు కూడా భాగం ఉంది, అందుకే ప్రజలకు క్షమాపణలు చెబుతున్నాను అని పేర్కొన్నారు. తనను కేవలం నిజామాబాద్‌కే పరిమితం చేయడం వల్ల రాష్ట్రంలోని ఇతర సమస్యలను పట్టించుకోలేకపోయానని, తన ప్రవర్తన ద్వారా మళ్లీ ప్రజల నమ్మకాన్ని గెలుచుకుంటానని ఆమె ధీమా వ్యక్తం చేశారు.రీజనల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టులో భారీ అవినీతి జరుగుతోందని కవిత ఆరోపించారు. పెద్దల భూములను కాపాడటం కోసం పేదల భూములను బలి పెడుతూ అలైన్‌మెంట్లు మార్చుతున్నారని విమర్శించారు. దీనిపై జనవరి 5న హైదరాబాద్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని, ఆన్‌లైన్ మూమెంట్‌ను కూడా చేపడతామని వెల్లడించారు. బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయినా చుక్క నీరు రాలేదని, నిర్వాసితులకు సరైన పరిహారం అందలేదని ఆమె ప్రభుత్వంపై మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్ఎస్ఎస్ సీఎం అని, ఆయన అంతర్గతంగా బీజేపీతో కుమ్మక్కయ్యారని విమర్శించారు.భువనగిరి జిల్లాలోని పలు సమస్యలపై కవిత ప్రభుత్వాన్ని నిలదీశారు. ఎయిమ్స్ భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, అందులోని ఉద్యోగాల్లో స్థానికులకే 80 శాతం అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆలేరులో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం, చేనేత కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రూ. 50 కోట్ల నిధుల విడుదల, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు వంటి అంశాలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని చెప్పారు. రాజకీయాల కోసం కాకుండా, కేవలం జనం సమస్యల పరిష్కారం కోసమే జాగృతి పనిచేస్తుందని, జిల్లా పర్యటనల్లో తేలిన ప్రతి సమస్యను పరిష్కారం అయ్యే వరకు ఫాలో అప్ చేస్తామని ఆమె స్పష్టం చేశారు.

## పీపీపీ విధానంపై వెనక్కి తగ్గేదేలేదు

నిర్ణయాలు తీసుకున్నారు.

### పీపీపీలకు వయబులిటీ గ్యాప్ ఫండింగ్

పీపీపీ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) విధానాన్ని అధికారులు సీఎంకు వివరించారు.

ఈ పథకం కింద వైద్య రంగంలోని ప్రాజెక్టులకు అయ్యే వ్యయంలో 60 శాతం వరకు ఆర్థిక మద్దతు లభిస్తుందని, ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 30 శాతం వాటాను భరిస్తాయని తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్, ఝార?ండ్ వంటి రాష్ట్రాల్లో ఇప్పటికే ఈ విధానంలో వైద్య కళాశాలల నిర్మాణానికి కేంద్రం అనుమతులు ఇచ్చిందని పేర్కొన్నారు. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్రంలోనూ వీజీఎఫ్ అమలు చేయాలని సీఎం సూచించారు.

### ఆదోని మెడికల్ కాలేజీకి సంస్థ ఖరారు

రాష్ట్రంలో తొలి విడతగా ఆదోని, మదనపల్లి, పులివెందుల, మార్కాపురం మెడికల్ కాలేజీల నిర్మాణానికి టెండర్లు పిలిచినట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో ఆదోని మెడికల్ కాలేజీ నిర్మాణానికి ఒక సంస్థ ముందుకు రాగా, ఆ సంస్థతో వెంటనే ఒప్పందం చేసుకొని పనులు ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. మిగిలిన కళాశాలల టెండర్ల ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సూచించారు.

### సంజీవని ప్రాజెక్టుపై సమీక్ష

ఈ సమావేశంలో కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన "సంజీవని"పైనా సీఎం సమీక్షించారు. కుప్పంలో ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ, త్వరలోనే ఈ ప్రాజెక్టును చిత్తూరు జిల్లా వ్యాప్తంగా విస్తరించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరి డిజిటల్ హెల్త్ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# నాగోబా జాతర షురూ...



**అదిలాబాద్ :** మెస్రం వంశీయుల ఆరాధ్య దైవం కేస్లాపూర్ నాగోబా మహా పూజలకు మెస్రం వంశీయులు శ్రీకారం చుట్టారు. పుష్యమాస అమావాస్యను పురస్కరించుకొని 2026 జనవరి 18న కేస్లాపూర్ నాగోబా జాతర నిర్వహించనున్న సందర్భంగా సోమవారం రాత్రి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మెస్రం వంశీయులు ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ గ్రామానికి చేరుకొని నాగోబా మురాడి దేవస్థానంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మెస్రం వంశీయుల పటేల్ కేస్లాపూర్ నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్ రావ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి సాంప్రదాయం ప్రకారం నెలవంకను దర్శించుకునీ, నాగోబాకు పూజలు నిర్వహించారు. ఆదివాసీలకు పవిత్ర మాసం ఈ పుష్యమాసం.. కాళ్లకు చెప్పులు ధరించకుండ, మద్యం, మాంసాలకు దూరంగా ఉంటూ నెలరోజుల పాటు అత్యంత పవిత్రంగా పుష్యమాసంలో అడవి బిడ్డలు తమ ఆరాధ్య దైవాలను కోలుస్తుంటారు. ఒక్కో గోత్రానికి ఒక్కో రకమైన ఆచారాలు సాంప్రదాయాలు వారి దైవాలు ఉంటాయి. అయితే ఈ మెస్రం వంశీయులకు నాగోబా కుల దైవం. మెస్రం వంశీయులలోనూ భుయ్ గొట్టే మెస్రం వంశీయులు పడియోర్ అని పిలుస్తుంటారు. ఆదివాసీలు తమ ఆచార సాంప్రదాయాల ప్రకారం సూర్య చంద్రులను దైవాలుగా కోలుస్తారు. అందులో ఒక భాగమే నేలవంక దర్శనం. మాసాలను గుర్తించే దిశగా ఈ నెలవంక సూచిస్తుంది. పుష్యమాసం ప్రారంభంతో నెల రోజుల పాటు భక్తి శ్రద్ధలతో తమ దైవాలను కోలుస్తుంటారు. మెస్రం వంశీయులు ప్రతియేటా నాగోబాను పుష్యమాసంలో భక్తి శ్రద్ధలతో కొలుస్తూ దర్శించుకుంటారు. వచ్చే 2026 జనవరి18న నాగోబాకు పవిత్ర గంగాజలంతో అభిషేకం నిర్వహించి మహాపూజ చేయనున్నారు. మహాపూజతో నాగోబా జాతర ప్రారంభం కానుంది. అయితే నాగోబాకు అభిషేకం కోసం కావలసిన పవిత్ర గంగాజలం సేకరణ, నాగోబా మహాపూజ, జాతర గురించి 7 గ్రామాల్లో, 7 రోజుల పాటు ప్రచారం నిర్వహించే (ఛకడ) ఎడ్లబండి నాగోబా ప్రచార రథయాత్రను నేడు మంగళవారం ప్రారంభించనున్నారు. నేడు మరోసారి అందరూ మెస్రం వంశీయులు సమావేశమై ఈ నాగోబా ప్రచార రథయాత్ర గురించి రూట్ మ్యాప్ ను తయారు చేసి నాగోబాకు పూజలు చేసి ఛకడ వాహనం ఎడ్లబండిపై నాగోబా ప్రచార రథయాత్ర ప్రయాణం చేయనున్నారు.

### 7 రోజులపాటు 7 గ్రామాలలో జాతర

7 రోజుల పాటు ఆయా గ్రామాల గుండా ఈ రథయాత్ర కొనసాగుతుంది. ఏడు గ్రామాలలో ఏడు రోజులపాటు నాగోబా జాతర ప్రారంభం గురించి మహాపూజకు కావాల్సిన కుండలు ఇతర వాటి సేకరణ గురించి కార్యాచరణ మొదలుపెడతారు. అనంతరం ఏడు రోజుల తర్వాత తిరిగి కేస్లాపూర్ కు చేరుకొని, నాగోబా అభిషేకం మహాపూజ కోసం కావలసిన పవిత్ర గంగాజలం కోసం మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని గోదావరినదిలో గల హస్తలమడుగు వద్దకు పాదయాత్రగా బయలుదేరనున్నారు

## నిరుపమాన దేశభక్తి, సచ్ఛీలతకు


# నిలువెత్తు నిదర్శనం వాజ్‌పేయి

**- నేడు భారతరత్న మాజీ ప్రధాని వాజ్ పాయ్ జయంతి**

**- వాజ్ పాయ్ జన్మదినాన్ని సుపరిపాలన దినోత్సవంగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం**

**( పెండ్యాల రామ్ కుమార్, మంథని )**

నిరుపమాన దేశభక్తి, సచ్ఛీలతకు నిలువెత్తు నిదర్శనం వాజ్‌పేయి..ఆరు దశాబ్దాల తన రాజకీయ జీవితంలో అజాత శత్రువుగా పేరు గాంచిన భారత రత్నం అటల్ బిహారీ వాజపేయి. దేశంలోని ఘనమైన రాజనీతిజ్ఞుల్లో వాజపేయి ఒకరు. వాజపేయి జీవితం.. విలువల విశ్వసనీయతకు నిదర్శనం. దేశంలో కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని నడిపిన ధీశాలి ఆయన. అటల్ బిహారీ వాజపేయి డిసెంబర్ 25 1924న మధ్య ప్రదేశ్ లోని గ్వాలియర్ లో జన్మించారు. అటల్ బిహారీ వాజ్‌పేయి భారతీయ జనతా పార్టీ తరపున ప్రధాన మంత్రి పదవిని పొందిన నాయకుడు. ఈయన బ్రహ్మచారి. ఇతను మొదటిసారిగా రెండవ లోక్‌సభ కు ఎన్నికైనారు. మధ్యలో 3వ మరియు 9వ లోక్‌సభలకు తప్పించి 14వ లోక్ సభ ముగిసేవరకు పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహించారు. ఆయన రెండుసార్లు రాజ్యసభకు కూడా ఎన్నికైనారు. 1968 నుండి 1973 వరకు జనసంఘ్ పార్టీ కి అధ్యక్షుడిగా పనిచేసి, 1980 నుండి 1986 వరకు భారతీయ జనతా పార్టీకి వ్యవస్థాపక అధ్యక్షుడిగా పనిచేశారు. 1996 లో తొలిసారిగా ప్రధానమంత్రి పదవి యోగం లభించినా అది 13 రోజులకే పరిమితమైంది. 1998 లో రెండో పర్యాయం ప్రధానమంత్రి పదవి పొంది 13 మాసాలు పాలించారు. 1999 లో 13వ లోక్‌సభ ఎన్నికల అనంతరం మరోసారి ప్రధానమంత్రి పదవి చేపట్టి 2004 వరకు పదవిలో ఉన్నారు. పోఖ్రాన్ అణుప్రయోగంతో దేశాన్ని పవర్ఫుల్ గా తీర్చిదిద్ది అగ్రరాజ్యానికి మనమేం తక్కువ కాదని నిరూపించిన నాయకుడు ఆయన. అలుపెరుగని ఈ రాజకీయ నాయకుడికి 1994 లో ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు లభించింది. మొదటి కాంగ్రేసేతర ప్రభుత్వమైన మొరార్జీ దేశాయ్ మంత్రివర్గంలో విదేశీ వ్యవహారాల శాఖను నిర్వహించారు. ఆయన అనారోగ్య కారణాలవల్ల క్రియాశీల రాజకీయాలనుండి తప్పుకున్నారు. 2005 డిసెంబర్ నెలలో ముంబై లోని శివాజీ పార్కులో జరిగిన భారతీయ జనతా పార్టీ సిల్వర్ జూబ్లీ ర్యాలీలో వాజపేయి క్రియాశీల రాజకీయాలనుండి నిష్క్రమిస్తున్నట్లు ప్రకటించాడు. తరువాతి సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేయనని ప్రకటించాడు..ఆయన దేశానికి చేసిన విశేష సేవలకు గానూ భారత ప్రభుత్వం డిసెంబర్ 24, 2014 లో భారతరత్న పురస్కారాన్ని ప్రకటించారు. ఆయన పుట్టినరోజు అయిన డిసెంబర్ 25 ను సుపరిపాలనా దినం గా భారత ప్రభుత్వం ప్రకటించింది. వాజ్‌పేయీకి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' మార్చి 27 2015 న ప్రదానం చేశారు. అనారోగ్యంతో పూర్తిగా మంచంపై ఉన్న వాజ్‌పేయీకి భారత రత్న ప్రదానం చేయడానికి స్వయంగా రాష్ట్రపతే వాజ్‌పేయీ నివాసానికి తరలి వచ్చారు. ఈయన ఆగస్టు 16, 2018 న తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో మృతి చెందారు.




## నేను ఏ పార్టీలో వుంటే ఆ పార్టీ గెలుస్తుంది

**- ఎమ్మెల్యే దానం**



**హైదరాబాద్** ఖైతరాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హాట్ కామెంట్స్ చేసారు. చ ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎవ్వరు ఏ పార్టీ లో ఉన్నారో నాకు తెలియదు కానీ... నేను మాత్రం కాంగ్రెస్ పార్టీ లోనే ఉన్నానని అన్నారు. జీహెచ్ఎంసి పరిధి ఓఆర్ఆర్ వరకు విస్తరించడం తో హైదరాబాద్ మరింత అభివృద్ధి చెందుతుంది. ఎంఐఎం తో కలుపుకొని కాంగ్రెస్ 300 డివిజన్ లలో గెలుస్తుంది. నేను ఏ పార్టీ లో ఉంటే ఆ పార్టీ గెలుస్తుందని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా 300 డివిజన్ లను తిరుగుతా. కాంగ్రెస్ పథకాలకు ప్రజల వివరిస్తానని అన్నారు.

## ప్రియుడి ఇంటి ముందు

# ధర్నాకు దిగిన ప్రియురాలు

**జగ్గయ్యపేట** కాకాని నగర్ లో యువతి ప్రియుడి ఇంటి ముందు ధర్నాకు దిగింది. సేకరించిన వివరాల మేర కైకలూరుకు చెందిన వరలక్ష్మి (29)జగ్గయ్యపేట కు చెందిన బాలు సత్య దేవ్ అనే యువకుడు దాదాపు 13 సంవత్సరాల పాటు కలిసి చదువుకోవడం జరిగిందని. ఆరేళ్లుగా ఇద్దరు కలిసి ప్రేమించుకున్నామని యువతి తెలియజేసింది. గత కొంతకాలంగా యువకుడు మొహం చాటేసాడు అని. యువకుడి కుటుంబ సభ్యులు కూడా గతంలో కేసులు పెట్టినప్పుడు నువ్వే మా కోడలు అని అన్నారని. ఇప్పుడు మాట మార్చి తన ప్రియుడిని కనపడకుండా చేసి తనను వదిలించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తుంది. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని యువతి కోరుతుంది.

# జనసేన వర్గాల ఘర్షణ

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటం గ్రామం పర్యటన సందర్భంగా జనసేన పార్టీలో రెండు వర్గాల మధ్య వివాదాలు భగ్గుమన్నాయి. ఇప్పటం గ్రామంలో ఇండ్ల నాగేశ్వరమ్మ ఇంటి వద్ద జనసేన శ్రేణులు ఒకరినొకళ్ళు కుర్చీలతో నువ్వు ఎంత అంటే నువ్వు ఎంత అని అనుకోవడంతో వివాదం ముదిరింది. ఒకరి మీద ఒకరు అక్కడే ఉన్న కుర్చీలు తో ఒకరిపై ఒకరు కుర్చీలు విసురుకుంటూ కార్యకర్తలు విధ్వంసం సృష్టించారు. ఒక వర్గంపై మరో వర్గం దాడికి దిగడంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్త నెలకొంది. అక్కడే ఉన్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి ఘర్షణ పడుతున్న ఇరువర్గాల పార్టీ శ్రేణులను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

## మేడారంలో గద్దెలపై కొలువుదీరిన

# పగిడిద్దరాజు, గోవిందరాజులు

**ములుగు** మేడారం మహా జాతర కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో గద్దెలపై పగిడిద్దరాజు, గోవిందరాజులు కొలువుదీరారు. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం గోవిందరాజును బుధవారం ఉదయం 6 గంటలకు, పగిడిద్దరాజును 9.45 గంటలకు పూజారులు ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, జాతర కార్యనిర్వహణాధికారి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులను గద్దెల ప్రాంగణంలోకి రానివ్వకుండా భద్రత ఏర్పాట్లు చేపట్టారు.

సమ్మక్క సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు పూజారులు కుటుంబాలతోపాటు హాజరై పూజా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. మేడారం జాతర వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జరుగనుంది. దీనికి తెలంగాణతోపాటు చుట్టుపక్కల ఉండే రాష్ట్రాల నుంచి కోటి మందికిపైగా భక్తులు తరలి వస్తారని అంచనా. ఈ సారిగా నూతనంగా నిర్మించిన గద్దెలపై సమ్మక్క, సారలమ్మతోపాటు పగిడిద్ద రాజు, గోవిందరాజులను కొలువుదీర్చుతున్నారు. జాతర ప్రాంగణాన్ని చారిత్రక కట్టడాల మాదిరిగా పటిష్ఠంగా ఉండేలా రాతితో పునర్నిర్మిస్తున్నారు. 46 పిల్లర్లతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్రాకారం ఉండనుంది. దాని మధ్య 40 అడుగుల వెడల్పుతో మూడు, 30 అడుగుల వెడల్పుతో ఐదు స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు. గద్దెల ప్రాంగణానికి ఎదుట 50 అడుగుల వెడల్పు ప్రధాన స్వాగత తోరణం ఉంటుంది. పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలను సమ్మక్క-సారలమ్మ గద్దెలు ఉండే వరుసలోకి మార్చారు. ఈ ఏర్పాటు ద్వారా భక్తులంతా ఒక వరుసలో దర్శనానికి వెళ్లేందుకు వీలు కలుగనుంది. వృత్తాకారంలో ఉండే గద్దెల చుట్టూ 8 స్తంభాలు ఉంటాయి. వాటి మధ్యలో వెదురు బొంగులతో డెకరేషన్ చేస్తారు.

# కాళేశ్వరంపై ఆశలు

**హైద్రాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడు రాజకీయాలు నీళ్ల చుట్టూ తిరుగుతున్నాయి. గత ఆదివారం మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పై కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ ముఖ్య మంత్రి చేసిన వ్యాఖ్యలు ఇప్పటికీ తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో చర్చ కు దారి తీస్తూనే ఉన్నాయి. కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను మర్చిపోక ముందే.. ఆయన కుమారుడు రంగంలోకి వచ్చారు. ఈసారి ఏకంగా ఆయన కాళేశ్వరం గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. గులాబీ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మంగళవారం సిరిసిల్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఆయన పరిపాలన మాఫియా మాదిరిగా ఉందని మండిపడ్డారు.. కెసిఆర్ పరిపాలన కాలంలో చేసిన మంచి పనులకు అనేక రకాలుగా రేవంత్ ప్రభుత్వం వక్ర భాష్యం చెబుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.. ఇందుకోసం రేవంత్ ప్రభుత్వం చేయని పని లేదంటూ మండిపడ్డారు. 2023 ఎన్నికల సమయంలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సంబంధించి కాంగ్రెస్ నాయకులు కుట్రలు చేశారని కేటీఆర్ ఆరోపించారు. ఆ పథకం పై బాంబులు వేయడం వల్లే దెబ్బ తిన్నదని అనుమానించారు.. ఆ ప్రాంతంలో ఇసుక మాఫియా చెలరేగిపోతుందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చెక్ డ్యాం ల మీద బాంబులు వేశారని మండిపడ్డారు. మానవ నిర్మిత అద్భుతమైన కట్టడాల మీద మానవ విధ్వంసం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టులను నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా గా పేరుపొందిన రాజేంద్ర సింగ్ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలిస్తున్న తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. "ఇసుకను తరలించడానికి ప్రాజెక్టులకు రంధ్రాలు చేస్తున్నారు. అందులో బాంబులు పెట్టి పేల్చుతున్నారు. ఇసుకను దోచుకోవడానికి ప్రాజెక్టులు అడ్డుగా ఉన్నాయని భావించి.. కోట్ల రూపాయల ప్రజల సొమ్ముతో నిర్మించిన చెక్ డ్యాములను పడగొడుతున్నారు. భూగర్భ జలాల పెంపుదల కోసం మా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చెక్ డ్యాములను నిర్మించాం.

ఇసుక కోసం వాటిని కూల్చివేసి.. పొలాలను ఎడారులుగా మారుస్తున్నారు. ఈ పరిణామాలు తెలంగాణ రాష్ట్రానికి ఎంత మాత్రం మంచిది కాదు. వీటిని చూస్తూ ఊరుకోమని" కేటీఆర్ వ్యాఖ్యానించారు. కేటీఆర్ చేసిన వ్యాఖ్యల పట్ల కాంగ్రెస్ నాయకులు కూడా అదే స్థాయిలో సమాధానం చెప్పారు. గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏం చేసిందని ప్రశ్నించారు.. బాంబులతో పెట్టి కూల్చేస్తే కూలిపోయే స్థాయిలో కాళేశ్వరం ఉందా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పడ్డది చిన్న పర్రే అని.. రిపేర్ చేస్తే సరిపోతుంది అని కేటీఆర్ గతంలో అన్నారని.. ఇప్పుడేమో బాంబులు పెట్టి కూల్చేశారని ఆరోపిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఏదైనా ఒక మాట మీద కేటీఆర్ నిలబడాలని సూచించారు.

## ఏడాదిలో కండోమ్స్ కోసం

# లక్ష రూపాయిలు

**- వాడు మగాడురా బుజ్జీ**




**ముంబై,** మరికొద్ది రోజుల్లో 2025 కాలగర్భంలో కలిసిపోనుంది.. ఈ నేపథ్యంలో ఈ ఏడాదికి సంబంధించిన అనేక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా ఈ కామర్స్ అనేది ప్రస్తుతం మన జీవితంతో అవినాభావ సంబంధాన్ని ఏర్పరచుకున్న నేపథ్యంలో.. ఈ కామర్స్ సంస్థలు తమ లావాదేవీలను వెల్లడిస్తుంటాయి. తమకు ఎదురైన అనుభవాలను పంచుకుంటాయి. మనదేశంలో ఈ కామర్స్ సంస్థలలో దిగ్గజ కంపెనీ ఇన్ స్టా మార్ట్ ఈ ఏడాదికి సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. ఆ సంస్థ వెల్లడించిన ఈ ఏడాది వార్షిక నివేదిక ప్రకారం.. అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. బెంగళూరు నగరానికి చెందిన ఓ వ్యక్తి అత్యంత కనిష్టంగా ఖర్చు పెట్టాడు. అతడు కేవలం పది రూపాయల ఆర్డర్ మాత్రమే ఇచ్చాడు. పది రూపాయల విలువైన ప్రింట్ అవుట్ కావాలని అతడు ఆర్డర్ పెట్టాడు. వాటిని మాత్రమే అతడు తెప్పించుకున్నాడు. ఈ ఏడాది ఇన్స్టా మార్ట్ లో అత్యంత కనిష్టమైన లావా దేవి ఇదేనని ఆ సంస్థ పేర్కొంది.. హైదరాబాద్ నగరానికి చెందిన ఓ వ్యక్తి లేటెస్ట్ ఐఫోన్ కోసం ఏకంగా 4.3 లక్షలు ఖర్చు పెట్టాడు.. ఇది అత్యంత ఖరీదైన లావాదేవీ అని ఇన్స్టా మార్ట్ ప్రకటించింది. కేవలం అతడు ఫోన్ల కోసమే భారీగా ఖర్చు పెట్టాడని ఇన్స్టా వెల్లడించింది. మరోవైపు ఓ వ్యక్తి ఏడాదిలో 22 లక్షల ను వివిధ ఉత్పత్తుల కొనుగోలుకు ఖర్చు పెట్టాడు. ముంబై నగరానికి చెందిన ఓ వ్యక్తి దాదాపు 15.16 లక్షల విలువైన బంగారాన్ని కొనుగోలు చేశాడు. చెన్నై నగరానికి చెందిన ఓ వ్యక్తి క×డో×మ్ ల కోసం ఏకంగా లక్ష రూపాయలు ఖర్చు పెట్టాడు. ఇన్ స్టా మార్ట్ నివేదిక ప్రకారం మనదేశంలో టైర్ 2 నగరాలలో రాజ్ కోట్ వేగవంతమైన అభివృద్ధిని నమోదు చేస్తోంది. ఇప్పటికే ఈ నగరం 10రెట్ల వృద్ధిని నమోదు చేసింది. లుధియానా ఏడు, భువనేశ్వర్ నాలుగు రెట్ల వృద్ధిని శ్రద్ధ చేసుకుంది.. ప్రజలు ఎక్కువగా ఆర్డర్ చేసిన వాటిల్లో కరివేపాకు మొదటి స్థానంలో ఉంది. ఆ తర్వాత పెరుగు, గుడ్లు, పాలు, పండ్ల వంటివి ఉన్నాయి.. కేరళ రాష్ట్రంలోని కొచ్చి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఏకంగా 368 సార్లు కరివేపాకు కోసం ఆర్డర్ పెట్టాడు. ఈ ప్రకారం చూసుకుంటే రోజుకు సగటున ఒకసారి అతడు ఆర్డర్ పెట్టినట్టు అర్థమవుతుంది. బెంగళూరు నగరానికి చెందిన ఓ వ్యక్తి తరచూ ఇన్ స్టా మార్ట్ లో కొనుగోలు జరిపాడు. అదే కాదు తనకు వస్తువులను డెలివరీ చేయడానికి వచ్చిన వ్యక్తికి ఏకంగా 68,600 టిప్ గా చెల్లించాడు. ఇక మిగతా తినుబండారాలు కూడా భారీగానే విక్రయమయ్యాయని ఇన్ స్టా మార్ట్ వెల్లడించింది. ఉదయం 7:00 నుంచి 11 గంటల వరకు.. సాయంత్రం 4గంటల నుంచి ఏడు గంటల వరకు తమకు ఆర్డర్లు ఎక్కువగా వచ్చినట్టు ప్రకటించింది.

## ఆధ్యాత్మికత ఆత్మ-పరమాత్మల

# అనుసంధాత

**- డాక్టర్ కె.వి. రమణాచారి**

**హైదరాబాద్** మానవ జీవితం ఆధ్యాత్మికతో ముడిపడి ఉన్న మహోన్నత స్థితి అని, దానికి పలు రచనలు, శ్లోకాలు ధన్యతను చేకూర్చుతాయని డాక్టర్ కె.వి. రమణాచారి అన్నారు. శ్రీ మానస ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయితలు డా? వేదాన్తం ఆంజనేయ కుమారస్వామి, బండారుపల్లి రామంద్రరావులు శ్రీ వెంకటేశ స్తోత్రములకు తెలుగు భావార్థముల సంకలన గ్రంథాన్ని, ప్రముఖ కవి రఘుశ్రీ రచించిన "రఘుశ్రీ హైకూలు" పుస్తకాన్ని తెలంగాణ ప్రభుత్వ పూర్వసలహాదారులు డా. కె.వి.రమణ చారి ఆవిష్కరించి, ప్రసంగించారు. మాసబ్యాంక్లో ని డా.రమణాచారి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మిక గాయకులు కడియాల ప్రభాకరరావు అధ్యక్షత వహించారు.

డాక్టర్ కె.వి. రమణాచారి ప్రసంగిస్తూ శ్రీ వెంకటేశ్వరస్వామి పద్దెనిమిది శ్లోకాలను ఎంచుకుని తెలుగు భావార్థ రచన గావించిన కుమారస్వామి, సంకలనకర్త బండారుపల్లి రామచంద్రరావుల కృషి ప్రశంసనీయమని ద్వైతాద్వైతములు, కర్మ యోగములు, భక్తియోగ జ్ఞానయోగ, రాజయోగ, బుద్ధి యోగముల విశ్లేషణ విశేషముగా ఉన్నావని, ఇటువంటి రచనలు మనస్సును ఉద్దీపింపజేసి అలౌకిక తత్వాన్ని, ఆధ్యాత్మిక ఆనందాన్ని కలుగ జేస్తాయని అన్నారు. ఇది నేటి యువతకు అవసరమైన గ్రంథమని అన్నారు. రఘుశ్రీ హైకూలులో సామాజిక స్పృహ, హాస్యం, వ్యంగ్యం, ఇమిడి ఉన్నాయని కొనియాడారు. అనంతరం గ్రంథకర్తలను ఘనంగా సత్కరించారు. ఇంకా సభలో పద్యకవి కళ్యాణశ్రీ మరియు గ్రంథకర్తలు ప్రసంగించారు. ఈ సందర్భంగా డా. రమణాచారి దంపతులను గ్రంథకర్తలు, మానస సంస్థ పక్షాన ప్రత్యేకించి సత్కరించారు. ఇదే సభలో డా. కె. సాంబమూర్తి, డా.నర్మదారెడ్డి, టి.వి. స్వామి, చీకోలు సుందరయ్య, పరిమి సత్యమూర్తి, డా. పరిమి సీతాలక్ష్మి, శ్రీమతి అపర్ణ, శ్రీమతి విజయభారతి తదితరులు ఆత్మీయ సత్కారాలు అందుకున్నారు. భా కార్యక్రమానికి ముందు జరిగిన కవి సమ్మేళనానికి విజయభారతి అధ్యక్షత వహించారు.

# జెన్ జెడ్ చుట్టూ ప్రపంచం

జన్ జడ్.. ఇటీవల ఈ పదం ఎక్కువగా వినిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా జెన్ జెడ్ యువత రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. బంగ్లాదేశ్, నేపాల్‌ల్లో ప్రభుత్వ మార్పుల్లో వీరి ప్రభావం కనిపించింది. ఇదే నేపథ్యంలో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జెన్ జెడ్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మార్చి 14న జరిగే జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని జెన్ జెడ్ థీమ్‌తో నిర్వహించనున్నారు. యువతను ఆకర్షించి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం. ఉద్యోగాలు, పారదర్శకత కోరే జెన్ జెడ్ ప్రజాస్వామ్యంలో మార్పులు తీసుకురాగలదా చూడాలి.ప్రపంచవ్యాప్తంగా జెన్ జెడ్ యూత్ ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు కొన్ని వార్తా సంస్థలు తెలుపుతున్నాయి. ముఖ్యంగా ఆర్థిక, రాజకీయ అంశాల్లో ఈ యువత తమ ప్రభావంతో స్థితిగతులను మార్చి వేస్తున్నట్లు కొందరు మేధావులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ప్రపంచం మొత్తం ఈ జెన్ జెడ్ యూత్ పై ఎక్కువగా ఫోకస్ చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో నేపాల్ రాజకీయాల్లో, బంగ్లాదేశ్ ప్రభుత్వం కూల్చడంలో ఉవని జి యూత్ ఎక్కువగా ప్రభావం చూపిందని తెలుస్తోంది. అయితే తాజాగా ఆంధ్రప్రదేశ్ లో జరిగిన జనసేన సమావేశంలో కూడా ఆ పార్టీ అధినేత మాట్లాడుతూ జెన్ జెడ్ యూత్ పై ఎక్కువగా ఫోకస్ చేయాలని అన్నారు. దీంతో జెన్ జెడ్ ప్రభావం రాజకీయ రంగంలో ఎంత ఉందో అర్థమవుతుంది. అసలు ఈ జెన్ జెడ్ యూత్ అంటే ఎవరు?1997 నుంచి 2012 వరకు జన్మించిన వారు ఇప్పుడు యవ్వనంలోకి వచ్చారు. వీరిని జెన్ జెడ్ యూత్ అని అంటారు. ఈ యువత ఎక్కువగా సోషల్ మీడియాను ఉపయోగిస్తూ ఉంటుంది. సోషల్ మీడియాను ఉపయోగించడం మాత్రమే కాకుండా తమ అభిప్రాయాలను వెంటనే వ్యక్తం చేయడం.. సామాజిక పరిస్థితులపై విశ్లేషణ చేయడం.. తప్పు, ఒప్పు ల గురించి చర్చించడం తీవ్రమైంది. ఎక్కువగా సామాజిక మాధ్యమాల్లో సమాజంలో జరిగే పరిస్థితులపై వీరు వెంటనే తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తారు. అంతేకాకుండా ఎక్కడ ఏ చిన్న విభిన్న పరిస్థితి ఏర్పడిన దానిని వీడియో తీసి సోషల్ మీడియాలో అప్లోడ్ చేస్తారు. ఇలాంటి యూత్ వల్ల ప్రస్తుత ప్రపంచ పరిస్థితులపై ఎక్కువగా ప్రభావం పడుతుందని అంటున్నారు.గతంలో నేపాల్ లో యూట్యూబ్ కంటెంట్ పై పరిమితులు విధించడంపై యువత పెద్ద ఎత్తున ఆందోళన చేసిన విషయం తెలిసిందే. వీరి ఆందోళనతోనే అక్కడి ప్రధాని దేశం విడిచి వెళ్లిపోయిన పరిస్థితి ఏర్పడింది. అంటే సాధారణ ఉద్యమాలకు భిన్నంగా వీరి ఆందోళన తీవ్రతరంగా ఉంటుంది. ర్యాలీలు, సమావేశాల ద్వారా మాత్రమే కాకుండా సోషల్ మీడియా ద్వారా వీరి ఉద్యమాన్ని ఉధృతం చేస్తారు. ఒక సమాచారాన్ని చాలామందికి చేరవేయడంలో వీరి పాత్ర ఎక్కువగా ఉంటుంది. ఆ తర్వాత బంగ్లాదేశ్ లోను అలజడి రేపిన యువత జెన్ జెడ్ యువతదే ఎక్కువ అని అంటున్నారు.తాజాగా పవన్ కళ్యాణ్ నిర్వహించిన జనసేన సమావేశంలోనూ జెన్ జెడ్ యూత్ పై ఎక్కువగా ఫోకస్ చేయాలని అభిప్రాయపడ్డాడు. వచ్చే ఆవిర్భావ సభలో జెన్ జెడ్ థీమ్ తో నిర్వహించాలని అన్నారు. వీరిని ఉపయోగించుకోవడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేసుకోవచ్చని అన్నారు. ఇప్పటికే జనసేన పార్టీకి సోషల్ మీడియాలో అత్యధిక ఫాలోవర్స్ ఉన్నారు. వీరికి ఎక్కువగా ప్రాధాన్యతమిస్తే పార్టీ మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నట్లు చెప్పారు. అయితే వచ్చే రోజుల్లో కూడా వీరి ప్రభావం మరింతగా ఉండే అవకాశం ఉందని అంటున్నారు. మరో వైపు వత ఆకాంక్షలను ప్రభుత్వాలు విస్మరిస్తే, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు వచ్చే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. దేశ యువత ఆకాంక్షలు ఆకాశాన్ని తాకుతుంటే, పాలకుల ఆలోచనలు మాత్రం పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల చుట్టూనే తిరుగుతున్నాయని విమర్శించారు. జెన్-జీ ఆలోచనలు, దేశ యువత ఆకాంక్షలు, ప్రభుత్వాల పాత్ర వంటి అంశాలపై తనదైన శైలిలో అద్భుతంగా ప్రసంగించి సభికులను ఆకట్టుకున్నారు. ప్రస్తుత తరం యువత (జెన్-జీ) కేవలం డిజిటల్ మీడియాకే పరిమితం కావద్దని కేటీఆర్ సూచించారు. సమాజం పట్ల అపారమైన బాధ్యతతో పనిచేయాలన్నారు. జెన్-జీ శక్తిని తక్కువ అంచనా వేయద్దని పాలకులను హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 400 ఎకరాల అటవీ భూమిని అమ్మాలని ప్రయత్నిస్తే, సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు అద్భుతంగా పోరాడి ప్రభుత్వ మెడలు వంచిన విషయాన్ని గుర్తుచేశారు. చివరికి సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఆ భూముల విక్రయాన్ని నిలిపివేసిందన్నారు. ఇదే జెన్-జీ పవర్ అన్నారు.సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే యువత, రాజకీయాల్లోకి కూడా రావాలని కేటీఆర్ సూచించారు. "రాజకీయాలు మీ భవిష్యత్తును నిర్ణయిస్తున్నప్పుడు, మీరే ఎందుకు రాజకీయాలను నిర్ణయించలేరు?" అని కేటీఆర్ యువతకు పిలుపునిచ్చారు.

ప్రపంచం అంతా ముసలితనంలో ఉంటే భారతదేశం మాత్రం యవరక్తంతో ఉరకలెత్తుతోందన్నారు కేటీఆర్. ఈ యువశక్తిని దేశ నిర్మాణానికి వాడుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1985లో చైనా, భారత ఆర్థిక వ్యవస్థలు దాదాపు సమానంగా ఉండేవన్నారు. అప్పుడు చైనా తలసరి ఆదాయం 300 డాలర్లు అయితే మనది 500 డాలర్లు. కానీ 40 ఏళ్ల తర్వాత చూస్తే, ఇండియా ఆర్థిక వ్యవస్థ 4 ట్రిలియన్ డాలర్లకే పరిమితం అయితే, చైనా 20 ట్రిలియన్ డాలర్లకు ఎదిగింది. ఇవాళ చైనా తలసరి ఆదాయం 13,000 డాలర్లు అయితే మనది కేవలం 2,700 డాలర్లే అన్నారు. చైనా మనల్ని ఎలా దాటిపోయిందో ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. అమెరికా, యూరప్‌లతో చైనా పోటీపడితే, మనం మాత్రం పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లతో పోల్చుకుని మురిసిపోతున్నాం" అన్నారు.

# సర్‌తో అంతా సరౌతుందా




**హైదరాబాద్ :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీస్తోంది. మరోవైపు మేధావి వర్గం సైతం అభ్యంతరాలు చెబుతోంది. ఈ సవరణలో భాగంగా చాలా రాష్ట్రాల్లో భారీ సంఖ్యలో ఓట్లను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారు. దీంతో ఇది దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఎన్నికల సంఘం తాజాగా తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాల ప్రకారం తమిళనాడులోని 97.37 లక్షల ఓట్లను తొలగించినట్లు ఈసీ అధికారికంగా ప్రకటించింది. గుజరాత్ లోను 73 లక్షల ఓట్లను జాబితా నుంచి తొలగించారు. తొలుత బీహార్లో ఈ ప్రక్రియ చేపట్టి ఎన్నికలు నిర్వహించారు. అక్కడ ఎన్డీఏ ఘనవిజయం సాధించడంతో ప్రత్యేక సమగ్ర సవరణ అనేది రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్నది అనే వాదన బలపడింది. ప్రజాస్వామ్యం పారదర్శకంగా ఉండాలన్న ఆలోచనతోనే ఈ ప్రక్రియ చేపట్టినట్లు కేంద్ర ఎన్నికల సంఘం చెబుతోంది. బీహార్లో ప్రత్యేక ఏజెన్సీ ద్వారా అధ్యయనం చేసిన తరువాత మాత్రమే ఈ ప్రక్రియ చేపట్టినట్లు చెప్పుకోస్తోంది ఈసీ.వాస్తవానికి ప్రతి రాష్ట్రంలోనూ మరణించిన వారి పేరుతో ఓట్లు ఉంటున్నాయి. వలస వెళ్లిన వారి పేరుతో ఓట్లు ఉంటున్నాయి. ఒక్కొక్కరికి రెండు చోట్ల కూడా ఓట్లు ఉంటున్నాయి. ఈ విషయంలో ప్రత్యేక సమగ్ర సవరణ మంచిదే. కానీ ప్రజలతో పాటు మేధావుల సందేహాలను నివృత్తి చేయడంలో మాత్రం ఎలక్షన్ కమిషన్ అనుకున్న స్థాయిలో శ్రద్ధ చూపడం లేదు. అందుకే రాజకీయ పార్టీల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఎన్నికల సంఘం మాత్రం ఈ ప్రక్రియ పూర్తిగా నిబంధనల ప్రకారమే జరుగుతోందని స్పష్టం చేస్తోంది. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల అనంతరం అభ్యంతరాల స్వీకరణకు అవకాశం కల్పిస్తున్నామని.. అర్హులైన వాటర్లు తమ పేరును తొలగించబడితే సంబంధిత బూత్ లెవెల్ అధికారులను కానీ.. ఈసీ వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచిస్తుంది. తుది జాబితా విడుదలకు ముందు అన్ని అభ్యంతరాలను పరిశీలిస్తామని అధికారులు చెబుతున్నారు.

అయితే బీహార్లో తమ ఓట్లు గల్లంతయ్యాయని.. చాలామంది ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో తమ ఓట్లను దూరం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు.ఎన్నికల కమిషన్ అభ్యంతరాలు ఉంటే చెప్పాలని చెబుతోంది. తమ ఓటు ఉందో లేదో తెలుసుకోవాలని సూచిస్తుంది. అయితే ఇప్పటివరకు తమ సొంత ప్రాంతంలో ఓటు వేసేవారు.. తాము నిజంగా ఓటర్లమని ధ్రువీకరించుకోవాల్సి వస్తోంది. దీనిపైనే ఎక్కువగా ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి. చనిపోయారని చెప్పి చాలా మంది ఓట్లను తొలగించారు. అటువంటి వారు న్యాయస్థానాలను ఆశ్రయించిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే ఈ సమగ్ర సవరణ అనేది మంచి కార్యక్రమమే. కానీ సరైన అధ్యయనం చేయకుండా చేస్తే మాత్రం ఇబ్బందికరమే. మనది అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. ఇక్కడ ఓటు అనేది ఆయుధం. అటువంటి ఓట్లను సవరించే క్రమంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. బీహార్లో అధ్యయనం చేసిన తరువాత మాత్రమే మిగతా రాష్ట్రాల్లో చేస్తున్నామని ఎలక్షన్ కమిషన్ చెబుతోంది.

కానీ ఈ అధ్యయనం ఎవరు చేశారు? ఏ సంస్థ చేసింది? ఏమని నివేదిక ఇచ్చింది? అనే విషయాలను మాత్రం ఎలక్షన్ కమిషన్ బయట పెట్టడం లేదు. అందుకే ఇప్పుడు అందరిలోనూ అదే అనుమానం. దేశవ్యాప్తంగా సమాజం పట్ల అవగాహన ఉన్న పౌరులతో పాటు తటస్థులు, మేధావులు ఇదే విషయంపై ప్రశ్నిస్తున్నారు. కానీ ఎన్నికల కమిషన్ నుంచి ఆశించిన స్థాయిలో జవాబు రావడం లేదు.ఇప్పటికే ఎన్ డి ఏ పై ఒక అపవాదు ఉంది. ఈవీఎంల టెంపరింగ్ చేశారన్నది ప్రధాన ఆరోపణ. దానిపై ఒక వైపు గలాటా నడుస్తుంటే.. కొత్తగా సమగ్ర సవరణ విషయంలో ఎన్నికల కమిషన్ ఎంత జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజల సందేహాలను నివృత్తి చేయాలి. రాజ్యాంగబద్ధమైన ఓ స్వతంత్ర సంస్థగా బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఎన్నికల కమిషన్ పై ఉంది. దానినే గుర్తు చేస్తున్నారు మేధావులు. ఆపై పౌర సమాజం. ఇక తేల్చుకోవాల్సింది ఎన్నికల కమిషన్ మాత్రమే.

# తెలంగాణకు పెద్ద ఎత్తున పులులు



**అదిలాబాద్** నీరు ఎత్తు నుంచి పల్లం ప్రాంతానికి ప్రవహిస్తుంది. అది సృష్టి నియమం కూడా. కేవలం నీరు మాత్రమే కాదు.. జంతువులకు కూడా ఇది వర్తిస్తుంది. కాకపోతే ఎత్తు, పల్లం నిబంధనలు ఇక్కడ వర్తించవు. కేవలం ఆహారం, గూడు, నీరు అనేవి మాత్రమే జంతువుల వలసకు వర్తిస్తాయి. జంతువులలో మిగతా వాటితో పోల్చి చూస్తే.. పులులు కాస్త విభిన్న తత్వాన్ని ప్రదర్శిస్తుంటాయి. ఆహారం, ఆవాసం, తోడు, సురక్షితం ఇలా అన్ని విషయాలలోనూ పకడ్బందీ లెక్కలతో ఉంటాయితెలంగాణకు సరిహద్దున మహారాష్ట్ర ఉంటుంది. మహారాష్ట్రలో దట్టమైన అడవులు ఉన్నాయి. అయినప్పటికీ అక్కడి పులుల కొన్ని ప్రస్తుతం తెలంగాణకు వస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి ప్రాంతాలలో సంచరిస్తున్నట్టు తెలుస్తోంది.సరిగ్గా కొద్ది రోజుల క్రితం టిప్పరేశ్వర్ అభయారణ్యం, తడోబా రిజర్వ్ నుంచి కొన్ని పులులు తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది. అందులో కొన్ని పులులు దక్షిణ మార్గంలో ఉన్న ప్రాంతాలలోకి వెళ్లిపోయాయని తెలుస్తోంది. అయితే కొన్ని పులులు ఈ మార్గాల గుండా ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి అనుకూలమైన వాతావరణము లేదు. ఎందుకంటే ఈ ప్రాంతాలలో గతంలో దట్టమైన అడవులు ఉండేవి. అక్రమార్కులు ఈ అడవిని చదును చేయడం వల్ల పులులు ఆ మార్గాల గుండా వెళ్లడానికి అవకాశం లేకుండా పోయిందని టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లాలో మల్యాలపల్లి సమీపంలో పులి ఉన్నట్టు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో సిబ్బంది రెండు రోజులుగా గాలింపు చర్యలు చేపడుతున్నారు.. " ఇక్కడ పెద్దగా అటవీ ప్రాంతం లేదు. కానీ కొన్ని కొండల వద్ద ఒక మేకల కాపరి పులి కాలి ముద్రలను చూసినట్టు మాకు చెప్పాడు. మేము పులిని గుర్తించడానికి ప్రయత్నిస్తున్నామని" డిప్యూటీ రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ కొమరయ్య పేర్కొన్నారు.ఈ పులి గతంలో రామగుండం సమీపంలోని సింగరేణి ప్రాంతాలలో కనిపించింది. పులి కనిపించినట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ జిల్లా పరిధిలోని 12 మండలాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కొమురయ్య సూచించారు. కామారెడ్డి జిల్లాలో గత వారం కల్పించిన ఒక పులి ఇప్పటికీ ఆ ప్రాంతంలో కనిపిస్తూనే ఉంది. అది అనేక పశువులను వెంబడించింది. కొన్ని పశువులను చంపి తినేసింది. పులి తిన్న తర్వాత మిగిలిన కళేబరాలను చూసి అక్కడి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పులి నిరంతరం సంచరిస్తున్న నేపథ్యంలో పశువులను చంపి తినే అవకాశం ఉండవచ్చని అడవి శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు దోమ కుంట, బిబి పెంట, బిక్నూరు మండలాలలో పులి కదలికలు కనిపించాయి.కొత్తగా వచ్చిన పులుల వల్ల.. ఈ ప్రాంతంలో ఉన్న మిగతా పులులు కూడా బయటకు వస్తున్నాయి. మూడు రోజుల క్రితం నాగర్ కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ మండలం లో ఒక పులి ఉన్నట్టు అటల్ శాఖ అధికారులకు సమాచారం అందింది. ఈ పులి అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ నుంచి మల్లేశ్వరం, వేమకల్, యంగంపల్లి ప్రాంతం నుంచి వచ్చి ఉండవచ్చని అధికారులు భావించారు. " ఈ పులి ఆంధ్రప్రదేశ్ లోని నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ నుంచి కృష్ణ నదికి అవతలి వైపు నుంచి వచ్చింది. గత ఏడాది కూడా ఒక పులి నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ నుంచి తిరిగి వచ్చింది" అని కొల్లాపూర్ అటవీశాఖ అధికారి ముజీబ్ గౌరీ వెల్లడించారు. " అప్పటినుంచి అది కనిపించలేదు. దాని ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నాం.

మా రేంజ్ ఆఫీసర్ హుస్సేన్, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర నాయకత్వంలో పులి సంచారం గురించి పరిశీలిస్తున్నాం. ఇక్కడ కెమెరా ట్రాప్ లు అందుబాటులో ఉంచాం. నదిని దాటి నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ లోకి తిరిగి వెళ్లే బదులు అది అమ్రాబాద్ టైగర్ రిజర్వుల్లోకి వెళ్లి ఉండవచ్చని" గౌరీ ప్రకటించారు. పులి సంచారం ఉన్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో సమీప ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు. మహారాష్ట్ర ప్రాంతంలో ఆహారం సరిగా లభించకపోవడం, ఆడపులుల సంఖ్య తక్కువగా ఉండడంతో పులులు ఇటువైపు వస్తున్నాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

## న్యూ ఇయర్ జోష్‌లో తప్పులు చేస్తే

**హైదరాబాద్ :** కొత్త సంవత్సరానికి ఓ మంచి వాతావరణంలో స్వాగతం పలకండి, గలీజు పనుల జోలికి వెళ్లొద్దు, సెలబ్రేషన్స్‌ని ఇల్లీగల్‌గా చేసుకొని కేసుల బారిన పడొద్దు అని కూల్‌కూల్‌గా మెసేజ్ ఇస్తున్నారు ఖాకీలు. కాదూకూడదూ అని రెచ్చిపోతే, కథ కటకటాల్లోకే అని గట్టి వార్నింగూ వినిపిస్తోంది.మరో వారం రోజుల్లో న్యూఇయర్ జోష్ షురూ. అంబరాన్నంటే సంబరాలే కాదు, ఓవరాక్షన్లు, ఆవారా పనులూ కూడా అప్పుడే. వెర్రెక్కిన కుర్రకారుకు అడ్డూ అదుపూ ఉండదు. పోలీసులకు ఏడాదంతా ఒక ఎత్తయితే, కొత్త సంవత్సర సీజన్ ఒక్కటీ ఒక ఎత్తు. ఎందుకంటే, సెలబ్రేషన్స్ పేరుమీద అక్కడ జరిగే అరాచకాలకు అంతే ఉండదు. అందుకే, ఎక్సైజ్, డ్రగ్ కంట్రోల్, లా అండ్ ఆర్డర్, టాస్క్‌ఫోర్స్.. అన్ని శాఖలూ ఒక్కటయ్యాయి. ఈగల్ టీములు కూడా ఎటెన్షన్‌లోకొచ్చేశాయి. ఉఊఓఅతోపాటు తెలంగాణలోని అన్ని జిల్లాల్లో స్పెషల్ డ్రైవ్‌కి సిద్ధమైంది ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్.హైదరాబాద్‌లోని పబ్బులు, ఫామ్ హౌస్‌లపై డేగ కన్నేశారు ఖాకీలు. డ్రగ్స్ అమ్మేవాళ్లతోపాటు వినియోగించేవాళు కూడా దొరికితే లోపలేయడం పక్కా. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీల్లో కనిపించకూడదు. ఇంతేకాదు, పరిమితికి మించి లిక్కర్ వాడినా నేరమే. అటు, నాన్ పెయిడ్ డ్యూటీ లిక్కర్ మీద కూడా ఫోకస్ పెట్టింది ఖాకీ శాఖ.గంజాయి విక్రయాల్లో స్టూడెంట్స్ కూడా ఉండడంతో కాలేజ్ యాజమాన్యాలు, హాస్టళ్ల ఓనర్స్‌తో మీటింగ్స్ పెట్టి క్లాసులు పీకారు పోలీసులు. ఇటు, ఏపీ, ఒడిషా, మహారాష్ట్ర నుంచి గంజాయి తరలిస్తున్నారన్న వార్తలతో అప్రమత్తమయ్యారు పోలీసులు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులు పెట్టి వాహనాలను ఎక్కడికక్కడే తనిఖీ చేసి పంపిస్తున్నారు. ఈగల్ టీమ్స్, ఎస్ఓటీ పోలీసులు కంబైన్డ్ ఆపరేషన్స్ స్పీడప్ చేశారు. నిన్నటికి నిన్న హైదరాబాద్ రాయదుర్గంలో ఐదుగురిని అరెస్ట్ చేసి, 12 గ్రాముల ఓఆఓం, 7 గ్రాముల గంజాయి సీజ్ చేశారు. పబ్‌లపై కూడా నిఘా పెంచేశారు. రూల్స్ ఉల్లంఘించిన పబ్‌లపై కేసులు నమోదయ్యాయి.ఇటీవలే ఆపరేషన్ దూల్‌పేట్ పేరుతో జూలు విదిల్చి, వంద కేసులు నమోదు చేసింది. వరుస తనిఖీలతో డ్రగ్స్ ట్రాఫిక్ నియంత్రణలోకొచ్చి, గంజాయి అమ్మకాలు 90 శాతం తగ్గినట్టు లెక్కుంది. అయినా సరే, న్యూ ఇయర్ వేడుకలను తేలిగ్గా తీసుకోవడం లేదు పోలీసులు.

## ఫోన్ ట్యాపింగ్‌లో చిక్కులు తప్పవా

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు ప్రస్తుతం కీలక మలుపు తిరిగింది. విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం తన దూకుడును పెంచడంతో, ఈ వ్యవహారం ఇప్పుడు నేరుగా రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావుల ముంగిటకు చేరినట్లు కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో జరిగినట్లుగా ఆరోపణలు వస్తున్న ఫోన్ ట్యాపింగ్ ఉదంతం కేవలం ఒక క్రైమ్ కేసుగానే కాకుండా, రాజకీయ భూకంపంగా మారింది. సీనియర్ ఐపీఎస్ అధికారి సజ్జనార్ నేతృత్వంలోని సిట్ బృందం పకడ్బందీగా ఆధారాలు సేకరిస్తోంది. ఇటీవల కీలక నిందితుడు, మాజీ నిఘా విభాగం చీఫ్ టి. ప్రభాకర్ రావు విచారణలో వెల్లడించిన అంశాలు ఇప్పుడు గులాబీ బాస్ చుట్టూ ఉచ్చు బిగించేలా ఉన్నాయి.అప్పటి ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకే విపక్ష నేతలు, వ్యాపారవేత్తలు, చివరకు సొంత పార్టీలోని అసంతృప్త నేతల ఫోన్లను కూడా ట్యాపింగ్ చేసినట్లు దర్యాప్తులో తేలింది. ముఖ్యంగా విదేశాల నుంచి విచారణకు సహకరిస్తున్నట్లు చెబుతున్న ప్రభాకర్ రావు, అప్పటి ప్రభుత్వంలోని అగ్రనేతల సూచనల మేరకే ఈ వ్యవస్థ నడిచినట్లు కీలక సమాచారం అందించినట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో నిధుల మళ్లింపును పర్యవేక్షించడానికి, ప్రతిపక్షాల వ్యూహాలను చిత్తు చేయడానికి ఈ ట్యాపింగ్ పరికరాలను వాడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం మారబోతోందని తెలిసిన వెంటనే ఇంటెలిజెన్స్ కార్యాలయంలోని హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేయడం ఈ కేసులో అతిపెద్ద నేరంగా పరిగణించబడుతోంది.అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, సిట్ అధికారులు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులకు నోటీసులు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. త్వరలోనే రాజకీయంగా ఎలాంటి అడ్డంకులు లేకుండా నోటీసులు జారీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభాకర్ రావుతో పాటు ఇతర నిందితుల స్టేట్‌మెంట్లలో వీరి పేర్లు ప్రస్తావనకు రావడంతో, అసలు ఈ నిర్ణయాల వెనుక ఎవరున్నారు? దీనికి నిధులు ఎక్కడి నుండి వచ్చాయి? అనే కోణంలో ప్రశ్నలు సిద్ధం చేసినట్లు సమాచారం.ఈ పరిణామాలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ సానుకూలంగా స్పందించారు. "చట్టం ఎవరికీ చుట్టం కాదు, తప్పు చేసిన వారు ఎంతటి వారైనా శిక్ష అనుభవించాల్సిందే" అని ఆయన వ్యాఖ్యానించారు. నిజానిజాలు వెలుగులోకి రావాలని, బాధితులకు న్యాయం జరగాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ యుద్ధంలా కాకుండా, ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన అంశంగా బీజేపీ చిత్రీకరిస్తోంది.ఈ కేసు కేవలం నోటీసులతో ఆగిపోతుందా లేదా అరెస్టుల వరకు వెళ్తుందా అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ కేసును లాజికల్ ఎండ్‌కు తీసుకెళ్లాలని పట్టుదలతో ఉంది. ఇది రాజకీయ కక్ష సాధింపు అని బీఆర్ఎస్ వాదిస్తున్నప్పటికీ, సాంకేతిక ఆధారాలు బలంగా ఉంటే తప్పించుకోవడం కష్టమే. ధ్వంసం చేసిన హార్డ్ డిస్క్‌ల నుండి రికవరీ చేసిన డేటా, నిందితుల మధ్య జరిగిన వాట్సాప్ చాట్స్ ఈ కేసులో కీలకం కానున్నాయి.తెలంగాణ రాజకీయ చరిత్రలో ఇదొక చీకటి అధ్యాయంగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. ప్రజాస్వామ్యంలో వ్యక్తిగత గోప్యతను హరించడం క్షమించరాని నేరం. ఒకవేళ సిట్ సేకరించిన ఆధారాలు కోర్టులో నిలబడితే, బీఆర్ఎస్ అగ్రనాయకత్వం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోక తప్పదు. వచ్చే కొన్ని వారాలు తెలంగాణ రాజకీయాల్లో అత్యంత కీలకం కానున్నాయి.

## బీఆర్ఎస్ సోషల్ మీడియా ఫుల్లీ లోడెడ్




**హైదరాబాద్ :** నేటి కాలంలో రాజకీయ పార్టీలకు బలమైన సోషల్ మీడియా ఉండాల్సిందే. నిజమో లేదా అబద్ధమో గట్టిగా చెప్పగలగాలి. ప్రస్తుతం ప్రపంచం మొత్తం సోషల్ మీడియా చుట్టూ తిరుగుతోంది కాబట్టి.. రాజకీయ పార్టీలకు బలమైన సోషల్ మీడియా అనేది ఒక కనీస అనివార్యతగా మారిపోయింది. అధికారంలో ఉన్న పార్టీ సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగించుకోవాల్సి ఉంటుంది. ప్రతిపక్షంలో ఉన్న పార్టీ సోషల్ మీడియాను మరింత పద్ధతిగా ఉపయోగించుకోవాల్సి ఉంటుంది.. ఏతా వాతా సోషల్ మీడియా అనేది ప్రస్తుత కాలంలో రాజకీయ పార్టీలకు కనీస అవసరం.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం అధికారంలో ఉంది. దశాబ్ద కాలం రాష్ట్రంలో అధికారానికి దూరమైన తర్వాత కాంగ్రెస్ పార్టీ 2023లో గద్దెనెక్కింది.. ఇలాంటి క్రమంలో ప్రభుత్వ పథకాలను.. ప్రభుత్వం చేస్తున్న పనులను.. గత ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన అక్రమాలను కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా బలంగా చెప్పగలగాలి. అవసరమైతే విస్తృతమైన నెట్వర్క్ ఏర్పాటు చేసుకొని ప్రజల్లో స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలి.. కానీ ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ మర్చిపోయినట్టు కనిపిస్తోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాదిరిగానే ఇప్పుడు కూడా సోషల్ మీడియా ను అంతంతమాత్రంగానే ఉపయోగిస్తుంది.ఇటీవల కెసిఆర్ బయటికి వచ్చారు. రేవంత్ ప్రభుత్వం మీద తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీ అనుకూల సోషల్ మీడియా మొన్నటి నుంచి అన్ని విభాగాలలో అధికార కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు మొదలుపెట్టింది. అంతేకాదు కేసీఆర్ మాత్రమే తెలంగాణకు రక్షకుడు అన్నట్టుగా ప్రచారం ప్రారంభించింది.. కెసిఆర్ చెప్పిన ప్రతి మాటను నిజమని నమ్మించే ప్రయత్నం చేసింది. ఈ విషయంలో గులాబీ పార్టీ సోషల్ మీడియా విజయవంతమైనది కూడా. వాస్తవానికి ఇలాంటి సమయంలో గులాబీ పార్టీ సోషల్ మీడియాకు బలమైన కౌంటర్ ఇవ్వడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైంది. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వింగ్ కు కర్త ఎవరు? కర్మ ఎవరు? క్రియ ఎవరు? అనే ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లేదు. పైగా కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆ పార్టీ సోషల్ మీడియా విభాగానికి కీలక స్థాయిలో పనిచేసిన వారంతా సరైన గుర్తింపు లేకపోవడంతో బయటకు వెళ్లిపోయారు. ఇప్పుడు ఎవరో కొందరిని రిక్రూట్ చేసుకున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీకి సోషల్ మీడియా ఆశించిన స్థాయిలో బలాన్ని ఇవ్వలేకపోతోంది.కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వింగ్ ఎంత బలహీనంగా ఉందో ఏబీఎన్ లో పనిచేసే కీలక న్యూస్ ప్రజెంట్ వెంకటకృష్ణ చేసిన వ్యాఖ్యలే బలమైన నిదర్శనం. సోమవారం నాటి ఏబీఎన్ ప్రైమ్ టైం బులిటెన్ లో వెంకటకృష్ణ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వింగ్ మీద తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. గులాబీ పార్టీ సోషల్ మీడియా విపరీతంగా ప్రచారం చేస్తుంటే.. కనీసం కౌంటర్ కాదు కదా.. ఏమీ ఇవ్వకుండా ముసుగు తన్ని పడుకున్నారని వెంకటకృష్ణ ఆరోపించారు. దీనిని బట్టి కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఎలా మార్పు చెందాలి? ఎలా బలోపేతం అవ్వాలి? అనే విషయాల మీద ఆ పార్టీ పెద్దలు దృష్టి పెడితే మంచిది. లేకపోతే అంతే సంగతులు. ప్రతిపక్ష పార్టీ సోషల్ మీడియా ముందు అధికార పార్టీ సోషల్ మీడియా సైలెంట్ అయిపోతే అంతకుమించిన దరిద్రం మరొకటి ఉండదు.

## వేములవాడ నియోజకవర్గంలో యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కమిటీల ఏర్పాటు

**- కష్టపడే కార్యకర్తలకు పదవులు ఖాయం - యువత శక్తితో కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం**

**- యూత్ కాంగ్రెస్ వేములవాడ నియోజకవర్గ అధ్యక్షులు : న్యాత నవీన్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ నియోజకవర్గంలో ఇండియన్ యూత్ కాంగ్రెస్ ను మరింత బలోపేతం చేసే దిశగా ప్రతి గ్రామం, ప్రతి మండలంలో గ్రామ కమిటీలు, మండల కమిటీలు, అలాగే అసెంబ్లీ స్థాయి కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు యూత్ కాంగ్రెస్ వేములవాడ నియోజకవర్గ అధ్యక్షులు న్యాత నవీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యూత్ కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి ఉన్న యువత తమ తమ మండలాలకు చెందిన యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని వినమ్రంగా కోరారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలకు తప్పకుండా తగిన ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే ఐ.వై.సి ఆప్ ను సమర్థవంతంగా వినియోగిస్తూ, ప్రతి కార్యకర్త తాము నిర్వహించే కార్యక్రమాలను యాప్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. యాప్ ద్వారా నమోదు అయిన కార్యక్రమాలనే పరిగణలోకి తీసుకుంటామని, కార్యకర్తల కష్టానికి తగిన ఫలితంగా పదవులు ఇచ్చే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటూ, సీనియర్ కాంగ్రెస్ నాయకత్వంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. యువత శక్తిని సమీకరిస్తూ ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ను వేములవాడ నియోజకవర్గంలో బలోపేతం చేయడమే లక్ష్యంగా అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. యూత్ కాంగ్రెస్ ద్వారా యువతకు సముచిత అవకాశాలు కల్పిస్తూ, ప్రజాసేవే ధ్యేయంగా ప్రేమాభిమానాలతో ముందుకు సాగుతామని న్యాత నవీన్ స్పష్టం చేశారు.

## సావిత్రిబాయి పూలే మహిళా సాధికారతకు పునాది వేశారు

**- టీపిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్**



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) సావిత్రిబాయి పూలే మహిళల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన మహోనీయురాలని కాంగ్రెస్ నాయకులు టీపిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. నిజామాబాదులోని కాంగ్రెస్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతూ, మహిళల విద్య హక్కు కోసం ఆమె చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని అన్నారు. మహిళల హక్కుల సాధన కోసం సావిత్రిబాయి పూలే ఎనలేని పోరాటం చేశారని కొనియాడారు. మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణించడానికి సావిత్రిబాయి పూలే వేసిన బలమైన పునాదే కారణమని తెలిపారు. ఆమె చూపిన మార్గంలో నడుస్తూ మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ల సిద్ధాంతంతో ప్రజాపాలన కొనసాగుతోందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విజన్ ఉన్న నాయకుడని, గ్లోబల్ సమ్మిట్ ద్వారా రూ.5 లక్షల 75 వేల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రావడం ఆయన దూరదృష్టికి నిదర్శనమని పేర్కొన్నారు. ఫోర్త్ సిటీ ప్రణాళికతో హైదరాబాద్ ప్రపంచ నగరాలతో పోటీ పడే స్థాయికి ఎదుగుతుందని తెలిపారు. పదేళ్ల విధ్వంస పాలన నుంచి రాష్ట్రం ఇప్పుడు వికాసం వైపు పయనిస్తోందని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్ కళాశాలలు, టెంపుల్ కారిడార్ రోడ్ వంటి అభివృద్ధి పనులతో జిల్లా పరిశ్రమలపరంగా, వ్యవసాయపరంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. త్వరలో నిజామాబాద్ జిల్లా, బాల్కొండ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ కళాశాల మంజూరు కోసం కృషి చేయనున్నట్లు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లాను మరింత అభివృద్ధి చేయడమే తమ ప్రధాన ధ్యేయమని అన్నారు. పంచాయతీ -2025 ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లాలో 90 శాతం పైగా స్థానాల్లో విజయం సాధించామని గుర్తుచేశారు. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ తన సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రజాపాలన కొనసాగుతోందని చెప్పారు. వచ్చే ఎన్నికల నాటికి నిజామాబాద్ జిల్లాను పూర్తిగా క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. మా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు మహేష్ కుమార్ గౌడ్ సమాధానం చెప్తూ ఫోన్ ట్యాపింగ్ కేసు విషయమై జరుగుతున్న అలసత్వానికి గల కారణం వివరిస్తూ ఫోన్ సంభాషణ అనేది వారి వ్యక్తిగత విషయం దాన్ని టాపింగ్ చేయడం చట్ట రిత్యా పెద్ద నేరం ఈ కేసులో ఉన్నదీ ఎవ్వరైనా వదిలే ప్రశక్తే లేదని టాపింగ్ కి పాల్పడివారిని వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేసారు.

## కాంగ్రెస్ మద్దతుతో గెలిచిన సర్పంచ్‌లకు ఘన సత్కారం

**- గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం**

**- యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు : న్యాత నవీన్**



వేములవాడ / చందుర్తి ( ప్రశ్న న్యూస్) వేములవాడ నియోజకవర్గం,చందుర్తి మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో విజయం సాధించిన నూతన సర్పంచ్‌లను బుధవారం యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు న్యాత నవీన్ (లడ్డు) శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా గ్రామస్థాయి నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కిష్టంపేట సర్పంచ్‌గా మొకెనపల్లి దేవరాజు, సనుగుల సర్పంచిగా బొడిగే లావణ్య అనిల్, ఆశీరెడ్డిపల్లె సర్పంచిగా బొజ్జ మల్లేశం, మర్రిగడ్డ సర్పంచిగా దూది మనిషా శ్రీనివాసరెడ్డి, కట్ట లింగంపేట సర్పంచ్‌గా అవారి రమేష్, చందుర్తి సర్పంచ్‌గా పులి సత్యం గౌడ్, బండపల్లి సర్పంచ్‌గా కటకం మల్లేశం, జోగాపూర్ ఉప సర్పంచ్‌గా గంట మల్లేశం ఎన్నికైన నేపథ్యంలో సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాత నవీన్ మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని, ప్రజల ఆశలను నెరవేర్చేలా కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సంతపూరి బాలుతో పాటు నాయకులు మ్యాదరి లక్ష్మీరాజం, అజయ్ రెడ్డి, ఎండి కరీం, రామిని సాయి, బొల్లిపల్లి చిరంజీవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు వెన్నుదన్నుగా ఉండాలి

**- సర్పంచులకు ప్రత్యేక అధికారాలు కల్పించాలి**

**- సిపిఎం పక్షాన నూతన పాలకవర్గం సభ్యులకు శుభాకాంక్షలు - శ్రీధర్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో సీపీఐ(ఎం) పార్టీ పక్షాన,గెలిచిన నూతన సర్పంచులు,వార్డు సభ్యులకు హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యం కావడంతో గ్రామాభివృద్ధి కుంటుపడిందని, నూతన సర్పంచులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ఫైనాన్స్ కమిషన్ నిధులను గ్రామపంచాయతీలకు పెంచాలని, సర్పంచులకు ప్రత్యేక అధికారాలు కల్పించాలని కేంద్ర%-%రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. పల్లెల అభివృద్ధికే అధిక నిధులు కేటాయించి గ్రామాల అభివృద్ధిని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల సిపిఎం కన్వీనర్ గురిజాల శ్రీధర్, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు రామంచ అశోక్, మండల నాయకులు కుడుకుల గిరిబాబు, పొత్తూరి నర్సయ్య,బొడ్డు రాజలింగం, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ వినియోగదారుల దినోత్సవం




నిజామాబాద్(ప్రశ్న న్యూస్) నేడు జాతీయ వినియోగదారుల దినోత్సవం 24 డిసెంబర్ 2025 సందర్భంగా బుధవారం కలెక్టరేట్ లోని జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం వేడుకలు అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్ కుమార్ అధ్యక్షతన జరపబడినది. ఈ సంవత్సరం అంశం "డిజిటల్ న్యాయ వ్యవస్థ ద్వారా త్వరితగతిన, సమర్థంగా కేసుల పరిష్కారం". ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులందరూ, వినియోగదారుల సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొని, మార్కెట్‌లోని ఏదైనా సేవలను వినియోగించుకోనేటప్పుడు వినియోగదారులు అనుసరించాల్సిన విలువైన మార్గదర్శకత్వాన్ని అందించారు. జాతీయ స్థాయిలో కన్స్యూమర్ హెల్ప్ లైన్ / నేషనల్ కన్స్యూమర్ హెల్ప్లైన్ నెంబర్ 1915 లేదా 1800001915 ద్వారా ఫిర్యాదులు నమోదు చేయవచ్చు అని తెలియజేసారు. ఈ సంవత్సరం ప్రధాన అంశానికి సంబంధించి అదనపు కలెక్టర్ తన విలువైన సందేశాన్ని ఇచ్చారు. కేసుల వేగవంతమైన పరిష్కారానికి, మాన్యువల్ ప్రక్రియను తగ్గించడానికి, మారుమూల, అణగారిన వర్గాలకు న్యాయం సులభంగా అందుబాటులోకి రావడానికి, పారదర్శకత, జవాబుదారీతనం కోసం డిజిటల్ న్యాయం అవసరమని అదనపు కలెక్టర్ అన్నారు. ఇంకా, కేసుల సమర్థవంతమైన, వేగవంతమైన పరిష్కారాన్ని సాధించడానికి డిజిటల్ న్యాయం ఒక శక్తివంతమైన సాధనమని తెలిపారు. దీని వల్ల తక్కువ ఖర్చుతో న్యాయం అందించబడుతుందని, పేపర్ లెస్ వ్యవస్థ ద్వారా పర్యావరణ అనుకూలమైనదిగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజర్ యం.శ్రీకాంత్ రెడ్డి, ఆహార భద్రతా అధికారి జి.నవిత, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి సుజాత్ అలీ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీకాంత్, వ్యవసాయ శాఖ అధికారులు, జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం అధ్యక్షులు మాయావర్ రాజేశ్వర్, ఇందూరు కన్స్యూమర్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అనిల్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, జిల్లా ఉపాధ్యక్షులు వర్మ, సంయుక్త కార్యదర్శులు మహాదేవుని శ్రీనివాస్, యాటకర్ల దేవేష్, గైని రత్నాకర్, పుప్పాల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రామానుజన్ జయంతి వేడుకలు



తార్నాక(ప్రశ్న న్యూస్) తార్నాక నారాయణ పాఠశాలలో గణిత శాస్త్ర శాస్త్రవేత్త శ్రీ రామానుజన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు రామానుజన్ కనిపెట్టినటువంటి గణిత సూత్రాలను ఉపయోగించి ఏ విధంగా గణితమును సులభతరంగా చేయవచ్చునో వారు నాటకీకరణ ద్వారా, నృత్య ప్రదర్శనల ద్వారా తెలియ జేశారు. ఆకారాలు, ఆకృతులు చార్టు ప్రదర్శనల ద్వారా అందరినీ ఆకట్టుకునేలా ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల జిఎం గోపాల్ రెడ్డి, ఏజిఎం బాలపరమేశ్వరావు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి వైజ్ఞానిక కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా వారికి భవిష్యత్తులో గణితశాస్త్రం మీద మంచి అవగాహన పెరగడమే కాకుండా గణితం ప్రాముఖ్యత తెలుస్తుందన్నారు పాఠశాల ప్రిన్సిపాల్ పర్వీన్ ప్రశ్నావళి, ఎక్కాలు, చిక్కు ప్రశ్నలలో గెలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈ చాంప్స్ కో-ఆర్డినేటర్ లక్ష్మీ భవాని, ఈ -కిడ్జ్ కో-ఆర్డినేటర్ నూర్, ఈ చాంప్స్ వి పి సరిత, ఈ- కిడ్జ్ షాహీన్, ఏ ఓ మహేందర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## కబడ్డీ టోర్నమెంట్ విజేతలకు సన్మానం



నాచారం(ప్రశ్న న్యూస్) నావికాదళ దినోత్సవం సందర్భంగా ఎస్ఎస్ఎస్ యువసేన, మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ టోర్నమెంట్ లో గెలిచిన నాచారం ఇందిరా స్కూల్ జట్టు ను ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పరమేశ్వర్ రెడ్డి, పాఠశాల యాజమాన్యం అభినందించడం తో పాటు సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ కబడ్డీ టోర్నమెంట్ లో 25 పాఠశాలలు పాల్గొనగా తమ పాఠశాల విద్యార్లులు అండర్ 14 తో పాటు అండర్ 17 లో టోర్నమెంట్ లో మొదటి స్థానం లో నిలిచారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం జట్టుకు శిక్షణ ఇచ్చిన పీఈటీ శేఖర్ ను అభినందించి ఘనంగా సన్మానించారు. పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ గత సంవత్సరం టోర్నమెంట్ లో తమ పాఠశాల విద్యార్థుల మొదటి స్థానంలో విజేతలు గా నిలిచారాని తెలిపారు. తమ పాఠశాలలో విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.

## ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ ఆధ్వర్యంలో సర్పంచ్ నల్ల మోహన్‌కు ఘన సన్మానం - శుభాకాంక్షలు

**- ఎమ్మెల్యే సత్యం సహకారం, సూచనలతో గ్రామాభివృద్ధికి పాటుపడుతా**

**- బోయినిపల్లి సర్పంచ్ : నల్ల మోహన్**




బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్ర గ్రామ సర్పంచిగా ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో డాక్టర్ మేడిపల్లి సత్యం ఆశీస్సులతో పోటీ చేసి భారీ మెజారిటీతో గెలుపొందిన నల్ల మోహన్‌ను బుధవారం బోయినిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లేష్ యాదవ్ మాట్లాడుతూ"చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం సహకారం, సూచనలతో సర్పంచ్ నల్ల మోహన్ గ్రామ అభివృద్ధి బాటలో ముందుకెళ్తారని ఆశిస్తున్నాం. రైతుల సమస్యల పరిష్కారం, వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి సర్పంచ్‌తో సమన్వయంగా పనిచేస్తాం. ఎమ్మెల్యే మార్గనిర్దేశంలో బోయినిపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపేందుకు మార్కెట్ కమిటీ పూర్తిస్థాయిలో సహకరిస్తుంది" అని తెలిపారు. అనంతరం సర్పంచ్ నల్ల మోహన్ మాట్లాడుతూ "గ్రామ ప్రజలతో పాటు చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం సహకారం, సూచనలతో ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తాను. గ్రామాభివృద్ధే నా ప్రధాన లక్ష్యం. ముఖ్యంగా రైతుల సంక్షేమం,మౌళిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తాను. వ్యవసాయ మార్కెట్ కమిటీతో కలిసి ఎమ్మెల్యే మార్గదర్శకత్వంలో బోయినిపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాను" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు

తార్నాక(ప్రశ్న న్యూస్) మెగా సెమీ క్రిస్మస్ వేడుకలు నారాయణ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాల యేసు జన్మించిన పశువుల పాక అలంకరణ వీక్షకులను ఆకట్టుకుంది. ఏసుక్రీస్తు జన్మ వృత్తాంతాన్ని తెలిపే పలు నాటికలు విద్యార్థులు చేత ప్రదర్శించి ఏసుక్రీస్తు శాంతి సందేశం సారాంశాన్ని తెలియపరిచారు.

చిన్నారులు దేవదూతల వేషధారణలో ఆకట్టుకున్నారు. పశువుల కాపరులు, ఏసుక్రీస్తు మరియా మాత, ఆనాటి యూదుల, రాజుల వేషధారణలు చూపర్లను ఆకర్షించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా జిఎం గోపాల్ రెడ్డి, ఏజిఎం బాల పరమేశ్వర్ లు హాజరై పండుగల ప్రాముఖ్యత ను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పర్వీన్, ఈ చాంప్స్ కో-ఆర్డినేటర్ లక్ష్మీ భవాని, ఈ కిడ్జ్ కో-ఆర్డినేటర్ నూర్, ఈ చాంప్స్ సరిత, ఈ- కిడ్జ్ వీపీ షాహీన్, ఏఓ మహేందర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



# 'ఈషా' కథ చెప్పగానే ఎంతో షాకింగ్‌గా అనిపించింది



ఇటీవల లిటిల్‌హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి లాంటి సూపర్‌హిట్ కల్ట్ చిత్రాలను ప్రేక్షకులకు అందించిన బన్నీవాస్, వంశీ నందిపాటి ఓహారర్ థ్రిల్లర్ 'ఈషా' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకరాబోతున్నారు. ఇటీవల 'రాజు వెడ్స్ రాంబాయి' మూవీతో సూపర్‌హిట్ కొట్టిన అఖిల్‌రాజ్‌తో పాటు త్రిగుణ్ హీరోలుగా నటిస్తుండగా.. ఇందులో హెబ్బాపటేల్ కథానాయికగా కనిపించనుంది. శ్రీనివాస్ మన్నె దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 25న చిత్రం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హీరో అఖిల్ రాజ్ మంగళవారం విలేకరులతో మాట్లాడి పలు విశేషాలు పంచుకున్నారు. "ఈషా' కథ చెప్పగానే ఎంతో షాకింగ్‌గా అనిపించింది. నేను ఎంతో ఎగ్జైట్ అయ్యాను. తప్పకుండా హారర్ థ్రిల్లర్ సినిమాలు చూసే వారికి కొత్త అనుభూతినిస్తుంది. ఇందులో ట్విస్టులు, సౌండ్ డిజైనింగ్ సూపర్బ్‌గా ఉన్నాయి. ఇందులో నేను వినయ్ అనే పాత్రను చేస్తున్నాను. నలుగురు చిన్నప్పటి స్నేహితుల్లో నేను ఒకర్ని. త్రిగుణ్, సిరి, హెబ్బా పటేల్, మైమ్ మధు వంటి మంచి నటులతో కలిసి నటించడం సంతోషంగా ఉంది. ఈ సినిమాను తెరకెక్కించిన దర్శకుడు శ్రీనివాస్ రాగా నుంచి కూడా చాలా నేర్చుకున్నాను. ఫలితం ఆశించకుండా కష్టపడాలి. యూనివర్స్ మనకు కావాల్సిన ఫలితం ఇస్తుందని నా నమ్మకం. కంటెంట్ బాగున్న సినిమాను ఎవరూ ఆపలేరు. నాకు 'ఈషా' ఓ గుర్తింపు వస్తుందనే నమ్మకం ఉంది. అందుకే ఈ చిత్రాన్ని ఒప్పుకున్నాను" అన్నారు.

# యాక్షన్-అడ్వెంచర్ థ్రిల్లర్‌గా 'సిగ్మా'



సుబాస్కరన్ లైకా ప్రొడక్షన్స్ మరో ప్రతిష్టాత్మక వెంచర్ 'సిగ్మా'తో రాబోతోంది. ఈ సినిమాతో కోలీవుడ్ సూపర్ స్టార్ దళపతి విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు.సందీప్ కిషన్ హీరో నటిస్తున్న ఈ చిత్రం యాక్షన్-అడ్వెంచర్ కామెడీగా రూపొందుతోంది. ఈ మూవీ టైటిల్, ఫస్ట్ లుక్ కు అద్భుతమై రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు మేకర్స్ అదిరిపోయే టీజర్ రిలీజ్ చేశారు. 'మంచోడు.. మహానుభావుడు.. చెడ్డోడు రాక్షసుడు.. చూసే నీ చూపుని బట్టి, ఇప్పుడు ఈ క్షణం నన్ను నేను కాపాడుకోవడానికి ఎలాగైనా మారుతాను' అనే హీరో పవర్ ఫుల్ డైలాగ్‌తో టీజర్ ప్రారంభమవుతుంది.తమన్ అందించిన దుమ్మురేపే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌కు ఎనర్జీ, ఇంటెన్సిటీని మరింత పెంచింది. డైలాగ్స్, విజువల్స్ చూస్తే సిగ్మా పూర్తిగా విజిలెంట్-హీరో జానర్‌తో ఆకట్టుకుంది. ఇది దళపతి విజయ్‌తో అనుసంధానమై ఉన్న స్పేస్ అయినప్పటికీ, జెన్-జీ టచ్‌తో అద్భుతంగా ప్రజెంట్ చేశారు. విజువల్‌గా టీజర్ చాలా రిచ్‌గా, క్లాసీగా ఉంది. సినిమాటోగ్రాఫర్ కృష్ణన్ వసంత్ కెమెరా వర్క్ ప్రతి ఫ్రేమ్‌ను ఎలివేట్ చేస్తూ, సినిమాకు గ్రాండ్ సినీమాటిక్ ఫీల్ ఇస్తుంది. లైకా ప్రొడక్షన్స్ మరోసారి తమ హై ప్రొడక్షన్ వాల్యూస్‌తో సినిమాను పెద్ద స్థాయిలో ప్రజెంట్ చేసింది. సందీప్ కిషన్ అద్భుతమైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో టీజర్ లో అదరగొట్టారు. యాక్షన్, ఇంటెన్సిటీ, ఎనర్జీ-మూడు అంశాల్లోనూ ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ అదిరిపోతుంది. అంతర్గత సంఘర్షణ, ఆశయం, సహజ స్వభావంతో మలచబడిన పాత్రలో ఆకట్టుకున్నారు. ఇంతకుముందెన్నడూ చూడని హై-ఇంపాక్ట్ యాక్షన్ అవతార్‌లో సుందీప్ కిషన్ రా అగ్రెషన్‌కి స్టైలిష్ స్వాగ్ ని అద్భుతంగా క్యారీ చేశారు.

# అందరూ మా మూవీని ఎంజాయ్ చేస్తారు



ఆది సాయి కుమార్ హీరోగా తెరకెక్కిన 'శంబాల' చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా క్రిస్మస్ కానుకగా.. డిసెంబర్ 25న గ్రాండ్‌గా రిలీజ్ అవుతోంది. డిసెంబర్ 23న ఆది సాయి కుమార్ పుట్టిన రోజు సందర్భంగా మీడియాతో ముచ్చటిస్తూ 'శంబాల' గురించి ఎన్నో విషయాల్ని పంచుకున్నారు. "శంబాల' చిత్రం బాగా వచ్చింది. ఆడియెన్స్‌కి మా సినిమా బాగా నచ్చుతుంది. అందరూ మా మూవీని ఎంజాయ్ చేస్తారని అనుకుంటున్నాను. ఈ చిత్రంలో అద్భుతమైన పోరాట సన్నివేశాలున్నాయి. రాజ్ కుమార్ మాస్టర్ అన్ని యాక్షన్ సీక్వెన్స్‌కి రిహార్సల్స్ చేశారు. దర్శకుడు యుగంధర్‌తో పాటుగా రాజ్ కుమార్ ట్రావెల్ చేశారు. క్లైమాక్స్‌లో వచ్చే యాక్షన్ సీక్వెన్స్ అదిరిపోతుంది. 80వ దశకంలో వచ్చే కథ కాబట్టి.. లుక్స్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. అందుకే కాస్ట్యూమ్స్‌ని చాలా సెలెక్టివ్‌గా తీసుకున్నాం. డిసెంబరర్ 25 డేట్‌ని వదులుకుంటే మళ్లీ ఇంత మంచి డేట్ నాకు దగ్గర్లో కనిపించలేదు. మేం ప్రీమియర్లతో ముందుకు వస్తున్నాం. ఇప్పటికే ప్రీమియర్లకు మంచి స్పందన వస్తోంది. ప్రీమియర్ల నుంచి పాజిటివ్ టాక్ బయటకు వెళ్తే.. డే వన్ నుంచే పికప్ అవుతుంది. కానీ ఈ డేట్‌కి టఫ్ కాంపిటీషన్ అయితే ఉంది. మా 'శంబాల' చిత్రాన్ని ఆడియెన్స్ హిట్ చేస్తే.. పార్ట్ 2 ప్లాన్ చేస్తాం" అని చెప్పుకొచ్చారు.

# రొమాంటిక్ మెలోడీ 'ఏదో ఏదో' సాంగ్ విడుదల



'లూసియా' ఫేమ్ సతీష్ నినాసం హీరోగా, నిర్మాతగా భారీ ఎత్తున రూపొందిస్తున్న చిత్రం 'ది రైజ్ ఆఫ్ అశోక'. ఈ సినిమాని వృద్ధి క్రియేషన్, సతీష్ పిక్చర్ హౌస్ బ్యానర్ల మీద వర్ధన్ హరి, జైష్ణవి, సతీష్ నినాసం సంయుక్తంగా నిర్మిస్తున్నారు.ఇక ఈ మూవీకి వినోద్ వి ధోండలే దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో సతీష్ నినాసంకి జోడిగా సప్తమి గౌడ నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన పోస్టర్స్, తాజాగా రిలీజ్ చేసిన పవర్ ఫుల్ సాంగ్ 'వినరా మాదేవ' అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇక తాజాగా ప్రేమ జంటను కట్టి పడేసేందుకు ఓ మంచి రొమాంటిక్ మెలోడీతో టీం ముందుకు వచ్చింది. తాజాగా 'ది రైజ్ ఆఫ్ అశోక' నుంచి 'ఏదో ఏదో' అంటూ సాగే పాటను విడుదల చేశారు. ఈ పాటను వింటే హీరో హీరోయిన్ల మధ్య ప్రేమ, వారి అనుబంధం, కెమిస్ట్రీ ఎలా ఉంటుందో అర్థం అవుతోంది. ఇక వీడియో సాంగ్ మొత్తాన్ని రిలీజ్ చేయడంతో.. పాటలోని అందమైన లొకేషన్లు, హీరో హీరోయిన్ల పాత్ర తీరు మొత్తాన్ని చూపించినట్టు అయింది. ఇందులో సతీష్, సప్తమీ గౌడ జంట చూడముచ్చటగా ఉంది. ఈ పాటకు తగ్గట్టుగా వారి స్టెప్పులు, లుక్స్ అన్నీ కూడా అద్భుతంగా కుదిరాయి. త్వరలోనే ఈ మూవీకి సంబంధించిన అన్ని పనుల్ని పూర్తి చేసుకుని ఆడియెన్స్ ముందుకు తీసుకు వచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్.

# అదే నిజమైతే తెలుగులో 'జన నాయకుడు' పరిస్థితి ఏంటి?




తమిళ సూపర్‌స్టార్ దళపతి విజయ్ నటిస్తున్న 'జననాయగన్' తన చివరి సినిమా అని ఇప్పటికే ప్రకటించారు. హెచ్. వినోద్ దర్శకత్వం వహిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో విజయ్ క్యారెక్టర్ ఫుల్ జోష్‌గా ఉండబోతోందని సినీ వర్గాల్లో హాట్ టాక్ నడుస్తోంది. ఇది టాలీవుడ్ హిట్ 'భగవంత్ కేసరి' ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రమని తెలుస్తోంది.

అందుకే తెలుగు ప్రేక్షకుల్లో కూడా ఈ సినిమాపై ఆసక్తి నెలకొంది. తమిళంలో ఈ సినిమాకు భారీ క్రేజ్ ఉంది. కాబట్టి అక్కడ ప్రీ-రిలీజ్ బిజినెస్ సూపర్ హైలెవల్‌లో సాగుతోంది. అదే థీమ్‌తో తెలుగులో 'జననాయకుడు' అనే టైటిల్‌తో డబ్బింగ్ వెర్షన్ రిలీజ్ చేయాలని నిర్మాతలు ప్లాన్ చేశారు. ఈ నేపథ్యంలో ప్రముఖ నిర్మాత నాగవంశీ తెలుగు రైట్స్ కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపారని టాక్ వినిపించింది. కానీ తెలుగులో అంచనాలకు తగ్గట్టు బజ్ రాకపోవడంతో ఆయన ఈ ప్రాజెక్ట్ నుండి వైదొలిగినట్లు సినీ సర్కిల్స్‌లో చర్చ జరుగుతోంది. దీంతో తెలుగు ఈ సినిమా విడుదలవుతుందా లేదా అన్న సందిగ్ధం ఏర్పడింది. పూజా హెగ్డే, మమితా బైజు కీలక పాత్రల్లో కనిపిస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ అద్భుతమైన మ్యూజిక్ సమకూరుస్తున్నారు. కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఈ భారీ ప్రాజెక్ట్ తెరకెక్కింది.

# ఆమె కళ్ళలో పట్టుదలను చూశాను: సుధా కొంగర



కోలీవుడ్ దర్శకురాలు సుధా కొంగర తెరకెక్కిస్తున్న లేటెస్ట్ మూవీ 'పరాశక్తి'. ఇందులో శివకార్తికేయన్, శ్రీలీల జోడీగా నటిస్తున్నారు.అలాగే రవి మోహన్ అథర్వ మురళి, ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమా శివ కార్తికేయన్ కెరీర్‌లో 25వ ప్రాజెక్ట్‌గా రాబోతుండటంతో ప్రేక్షకుల్లో అంచనాలు పీక్స్‌లో ఉన్నాయి. ఆకాశ్ భాస్కరన్‌కు చెందిన డాన్ పిక్చర్స్ బ్యానర్‌పై రూ.150 కోట్ల బడ్జెట్‌తో 'పరాశక్తి'ని నిర్మిస్తోంది. పొలిటికల్ డ్రామాగా, లవ్ స్టోరీ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 10న థియేటర్స్‌లోకి రాబోతుంది. ఈక్రమంలో.. తాజాగా, ప్రమోషన్స్ జోరు పెంచిన సుధా కొంగర వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ పలు ఆసక్తికర విషయాలు చెబుతోంది. ఇటీవల జరిగిన ఓ ఇంటర్వ్యూలో శ్రీలీలపై ప్రశంసలు కురిపించింది. "శ్రీలీల ప్రతి పదానికి అర్థం తెలుసుకుంటూ తమిళం చాలా బాగా నేర్చుకుంది. ఆమె డ్యాన్సింగ్ క్వీన్. మేకప్ లేకుండా అందాల రంగంలో ఒక ముఖాన్ని చూసి చాలా కాలం అయ్యింది. కానీ శ్రీలీల వైజయంతిమాల లాంటి అనుభూతిని కలిగిస్తుంది. ఈ పరాశక్తి షూటింగ్ సమయంలో, ఆమెకు చివరి మెడికల్ పరీక్షలు జరుగుతున్నాయి. దీంతో శ్రీలీల ఉదయం పరీక్షలు పూర్తి చేసి మధ్యాహ్నానికి షూటింగ్ కోసం సెట్‌కు వచ్చింది. నేను ఆమె కళ్ళలో ఒక పట్టుదలను చూశాను. ఆ క్షణమే సినిమాలో 'రత్నమాల' పాత్ర కోసం ఆమెను ఎంపిక చేయాలని నిర్ణయించుకున్నాను" అని చెప్పింది. సుధా కొంగర మాటలు చూస్తే 'పరాశక్తి'లో శ్రీలీల పాత్ర చాలా ప్రత్యేకంగా ఉండబోతోందని స్పష్టమవుతోంది. శివకార్తికేయన్ కెరీర్‌లో మైలురాయిగా నిలిచే అవకాశం ఉన్న ఈ సినిమా, శ్రీలీలకు కూడా మరో లెవల్ గుర్తింపును తీసుకురావడం ఖాయమనే అభిప్రాయం అభిమానుల్లో వ్యక్తమవుతోంది. మొత్తానికి భారీ బడ్జెట్, బలమైన కథ, స్టార్ కాస్ట్‌తో 'పరాశక్తి' 2026 ప్రారంభంలో బాక్సాఫీస్‌ను షేక్ చేయడానికి సిద్ధంగా ఉంది.

# నేను తప్పక అలా చేయాల్సి వచ్చింది



బిగ్‌బాస్ సీజన్-9 పూర్తి అయినప్పటికీ ఇప్పటికీ ఎంతోమంది ఇందులో పాల్గొన్న కంటెస్టెంట్స్ గురించి మాట్లాడుకుంటున్నారనడంలో అతిశయోక్తి లేదు. తొందరగా అయిపోయిందని కొందరు చాలా బాధపడిపోతున్నారు కూడా. ఇదిలా ఉంటే.. ఈ షోలో పాల్గొన్న కామనర్ మర్యాద మనీష్ అందరికీ సుపరిచితమే. ఇంట్లోకి వెళ్లి రెండో వారానికే ఎలిమినేట్ అయి బయటకు వచ్చేశాడు. కానీ నామినేషన్స్‌లో మళ్లీ లోపలికి వెళ్లి తనూజపై షాకింగ్ కామెంట్ చేశాడు. ముద్దు మాటలతో చెవిలో ముద్ద మందారం పూలు పెడుతుందని అన్నాడు. దీంతో ఆయనపై విమర్శలు వచ్చాయి. అయితే ఫైనల్ ఎపిసోడ్‌లో తనూజ ఈ విషయంపై స్పందిస్తూ.. మర్యాత మనీష్ మాటలు తనను ఎంతగానో బాధించాయని చెప్పింది. తాను అతని నుంచి క్షమాపణలు కూడా కోరుతున్నట్లు చెప్పడంతో ఈ విషయంపై స్పందించిన మనీష్ ఇన్‌స్టాలో ఓ ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు. "ప్రియమైన తనూజ పుట్టస్వామి మీ ఆట గురించి ఎక్కడ నుండి మొదలుపెట్టాలో, ఏం చెప్పాలో అర్థం కావడం లేదు. 105 రోజుల పాటు, ఇంత తెలివైన, అద్భుతమైన ఆట ఆడటం దాదాపు అసాధ్యం. కానీ మీరు అది చేసి చూపించారు. మీరు ఉధృతంగా, బలంగా పోరాడారు. ఈ సీజన్‌లో నాకు ఇష్టమైన టాప్ 5 ఆటగాళ్లలో మీరు ఎప్పుడూ ఉండేవారు. నేను కొన్నిసార్లు మీకు ఓటు కూడా వేశాను. నాకు చదరంగం అంటే చాలా ఇష్టం. చదరంగంలో రాణి అత్యంత శక్తివంతమైన క్రీడాకారిణి, ఆట గెలవడానికి అందరూ ముందుగా రాణిపై దాడి చేయాలనుకుంటారు. రాణి ఓడిపోతే ఆటను కూడా వదిలేస్తారు. నాకు రీ-ఎంట్రీకి అవకాశం వచ్చినప్పుడు నేను మీతోనే ఆడాల్సి వచ్చింది. ఎందుకంటే మీరు రాణి ఈ సీజన్‌లోని అత్యంత బలమైన క్రీడాకారులలో ఒకరు. ఇంట్లో, బయట ప్రజల మధ్య కూడా! కానీ ఫినాలే సమయంలో నా మాటలకు మీరు బాధపడ్డారని మీరు చెప్పినప్పుడు, నాకు మైక్ దొరికి ఉంటే నేను ఆ షోలోనే మనస్ఫూర్తిగా క్షమాపణ చెప్పేవాడిని. మనం కలిసినప్పుడు నేను మొదటగా అదే చేశాను. కానీ మళ్ళీ, బహిరంగంగా కూడా మరోసారి క్షమాపణ చెప్పడానికి సంతోషిస్తాను. ఎందుకంటే మనమందరం చేసినదంతా ఆట కోసమే! క్షమాపణ చెప్పడం వల్ల ఎవరూ చిన్నవారు లేదా పెద్దవారు కారు. ఇది ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం స్నేహ హస్తం అందించడమే.

# నేను మనిషినే.. నాకు కర్మలుంటాయి.. తన కామెంట్స్‌పై శివాజీ పశ్చాత్తాపం



దండోరా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో యాక్టర్ శివాజీ మాట్లాడుతూ.. అందం చీరకట్టులో, ఒళ్లు కనిపించకుండా వేసుకునే బట్టల్లోనే ఉంటుంది. అలా కాకుండా అభ్యంతరకరంగా (సామాన్లు కనిపించేలా) బట్టలు వేసుకుంటే అందులో విలువేముంటుంది? అంటూ చేసిన కామెంట్స్ తీవ్ర దుమారం లేపిన విషయం తెలిసిందే. ఈ కామెంట్స్‌పై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవడంతో ఇప్పటికే శివాజీ క్షమాపణలు కూడా తెలియజేశాడు. తాజాగా తన స్పీచ్‌పై మరోసారి పశ్చాత్తాపం వ్యక్తం చేశాడు శివాజీ. తనతోపాటు స్టేజ్‌పై ఉన్న ఆడబిడ్డలకు క్షమాపణలు చెప్పాడు. నా 30 ఏళ్ల కెరీర్‌లో ఎప్పుడూ ఇలా జరుగలేదు. నా స్టేట్‌మెంట్‌కు కట్టుబడే ఉన్నా. ఆ రెండు పదాలు మాత్రం తప్పుగా మాట్లాడానన్నాడు శివాజీ. ఆ రోజు స్టేజీ మీదున్న నా తోటి నటీనటులు, ఆడబిడ్డలకు మొదట క్షమాపణలు చెప్పాలి. ఆ పదాలు దొర్లకూడదు. నేనిక్కడికి వచ్చి 30 సంవత్సరాలైంది.. నా జీవితంలో ఎప్పుడూ ఇలా జరుగలేదన్నాడు. అన్ని సంవత్సరాలు పాలిటిక్స్‌లో ఉన్నా ఏ రోజూ కూడా ఒక చిన్నమాట జగన్ గారినైనా.. లేదంటే ఏ మహిళనైనా, ఏ పార్టీనైనా నా హద్దుదాటి మాట్లాడలేదు. అలాంటిది మరి ఎందుకో నాకు అలా తెలియకుండానే మాట దొర్లిపోయింది. చాలా బాధపడ్డా. ఆ రెండు పదాలు వాడినందుకు నా ఆడబడ్డలకు క్షమాపణలు చెబుతున్నానన్నాడు. బయట నుంచి హీరోయిన్లు కానీ, మన హీరోయిన్లు కానీ కాస్త ఫంక్షన్లకు వెళ్లేటపుడు కొంచెం మంచి బట్టలు వేసుకుని వెళ్లండమ్మా.. మనకెందుకీ దరిద్రం.. బయట వాళ్లందరూ ఎగబడతారు. మొన్న మనమక్కడ చూశాం కదా.. కొత్తగా చూపించేది తర్వాత ఒక పదం వాడాను. ఆ పదం అస్సలు వాడకూడదు. నాకిప్పటికీ కూడా అది నన్ను ఎన్నాళ్లు వేంటాడుతుందో తెలియదన్నాడు శివాజీ. నేనా ఈ పదం వాడింది అని అనిపించింది.. ఒకే నేను మనిషినే.. నాకు కర్మలుంటాయి.. పొరపాటు జరిగిందని చెప్పుకొచ్చాడు శివాజీ. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

## గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తా

**తుక్కాపూర్ గ్రామ సర్పంచ్ దొడ్లే ఆంజనేయులు**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) తన సొంత డబ్బులతో గ్రామపంచాయతీకి 20 హై ఓల్టేజ్ విద్యుత్తు దీపాలను గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆరె రవీందర్, టిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మల్లయ్య, వార్డు సభ్యులు సర్ధన సుధాకర్, ఎలుక గంగయ్య, గ్రామస్తులు టేక్మాల్ మల్లప్ప, శంకర్ రావు, ఆయలి శేఖర్, సిద్దప్ప శ్రీశైలం, రాజు, చంద్ర శేఖర్, బిక్షపతి, నర్సింలు, శివశంకర్, దుర్గేష్, కిష్టయ్య, కృష్ణ, గ్రామ పంచాయతీ సిబ్బంది దానయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి.



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్) మెదక్ మండలం గుట్టకింద పల్లి గ్రామానికి చెందిన అయితరాబోయిన చంద్రం ఇటీవల ప్రమాదవశాస్తూ విద్యుత్ షాక్ తో మరణించారు. ఈవిషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు యం. పద్మ దేవేందర్ రెడ్డి బుధవారం గుట్టకిందపల్లి గ్రామానికి చేరుకొని చంద్రం భార్య భవానిని పరమర్శించి, మనోధైర్యాన్ని తెలిపి భరోసానిచ్చారు. ఈ సందర్భంగా రూ. 5 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వీరి వెంట మెదక్ మండల పార్టీ అధ్యక్షులు యం. అంజ గౌడ్, మెదక్ మాజీ ఎంపీపీ కొత్తపల్లి. కిష్టయ్య, నాయకులు రాములు, రవి సుధాకర్, నాగమల్లు, శేఖలు, శంకరయ్య, పెంటయ్య, ఆగం, యాదగిరి తదితరులు ఉన్నారు.

## కేంద్రమంత్రి బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరిన సర్పంచ్ సౌమ్య - మహేష్ దంపతులు

**- కేంద్ర సంక్షేమ పథకాల ప్రేరణతోనే భాజపా లోకి....**

**- బూరుగుపల్లి గ్రామ సర్పంచ్ : పెంచాల సౌమ్య - మహేష్ దంపతులు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని బూరుగుపల్లి గ్రామ సర్పంచ్ పెంచాల సౌమ్య– మహేష్ దంపతులు బుధవారం బీజేపీ నాయకులు సూదుల సాయి అక్షిత్ ఆధ్వర్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ కుమార్ చేతుల మీదుగా బీజేపీ కండువా కప్పుకొని భారతీయ జనతా పార్టీలోకి సాదరంగా చేరారు. ఈ సందర్భంగా మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పులు తీసుకొచ్చాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు చివరి వ్యక్తి వరకూ చేరేలా పార్టీ శ్రేణులు కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో బలమైన నాయకత్వం బీజేపీకి మరింత బలం చేకూరుస్తుందని అన్నారు. అనంతరం సర్పంచ్ సౌమ్య– మహేష్ దంపతులు మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధి, ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తామని, బూరుగుపల్లి అభివృద్ధికి బీజేపీ వేదికపై మరింత కృషి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాజపా నేతలు దుర్శెట్టి ఆంజనేయులు, బూత్ అధ్యక్షుడు రజనీకాంత్, ప్రసాద్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రిస్మస్ పండగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలి

**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) యేసుక్రీస్తు జన్మదినోత్సవమైన క్రిస్మస్ పర్వదినాన్ని ప్రతి ఒక్కరు ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం క్రిస్మస్ పండగను పురస్కరించుకొని కలెక్టర్ రాహుల్ రాజ్ క్రిస్టియన్ సోదరులు, సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. యేసు క్రీస్తు జన్మదిన సందర్భంగా క్రైస్తవులు జరుపుకొనే పండగ క్రిస్మస్‌ను ఎంతో పవిత్రంగా భావిస్తారని... క్రీస్తు కరుణామయుడుగా, దయామయుడుగా ఆయన అందరి ఆరాధనలు అందుకుంటున్నారని కలెక్టర్ తెలిపారు. అలాగే సాటి మనుషుల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ, ఆకాశమంతటి సహనం, అవధులు లేని త్యాగం, శాంతియుత సహజీవనం, శత్రువుల పట్ల సైతం క్షమా గుణం కలిగి ఉండటమే యేసుక్రీస్తు అందరికి ప్రబోధించారని దీనిని అనుసరించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ కోరారు. క్రిస్మస్ పర్వదినాన్ని ఆనందంగా జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ రాహుల్ రాజ్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

## నర్సాపూర్ నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ పార్టీ గ్రామ సర్పంచులు, ఉపసర్పంచ్‌లు మరియు వార్డ్ మెంబర్ల

**సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి హరీష్ రావు ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) సర్పంచ్ ఎన్నికల్లో ఒక ముఖ్యమంత్రి కాలుకు బలపం కట్టుకొని తిరగడం ఎప్పుడు జరగలేదు. ఓటమి భయంతో రేవంత్ రెడ్డి ఊరు ఊరు తిరిగి ప్రచారం చేసాడు. ఎక్కడైనా అధికారంలో ఉన్న పార్టీ 90% స్థానిక సంస్థల్లో విజయం సాధిస్తుంది. కానీ 6000 కాంగ్రెస్ గెలుస్తే 4000 బీఆర్ఎస్ గెలిచింది. కాంగ్రెస్ పార్టీ డబ్బు, గుండాయిజం, మద్యం, పోలీసులు అన్ని రకాలుగా ప్రయత్నం చేసిన బీఆర్ఎస్ 40% గెలిచి నిలిచింది. రేవంత్ రెడ్డిది మేకపోతు గాంభీర్యం. గతంలో బీఆర్ఎస్‌ను మొలకెత్తనియ్య అన్నాడు.. ఇవ్వాళ 4000 మంది సర్పంచులు రేవంత్ రెడ్డి గుండెల్లో నుండి మొలకెత్తారు. కాంగ్రెస్ వాళ్లకు భయం పట్టుకుంది.. అందుకే కార్పొరేషన్ ఎన్నికలు పెట్టకుండా నామినేటే పద్ధతి తెస్తారంట.. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు కూడా పెట్టడానికి భయపడే పరిస్థితి రేవంత్ రెడ్డిది. కేంద్రం నుండి వచ్చే డబ్బులు వందకు 85 రూపాయలు డైరెక్ట్ సర్పంచ్ అకౌంట్‌లోనే పడుతాయి. రేవంత్ రెడ్డికి సంబంధం లేదు. మీకు శాంక్షన్ అయ్యే డబ్బులతో మీ గ్రామాలను అభివృద్ధి చెయ్యండి. ఎవ్వరికి భయపడాల్సిన పని లేదు. ఒక రెండేళ్లు ఓపిక పట్టండి.. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. తెలంగాణలో ఎగిరేది గులాబీ జెండానే. మిమ్మల్ని ఇబ్బంది పెట్టే ప్రతి ఒక్కరి పేర్లు రాసి పెట్టుకోండి. అందరి లెక్కలు తేలుద్దాం.. ఎవ్వరిని వదిలిపెట్టేది లేదు. ఓడిపోయిన సర్పంచి అభ్యర్థులు అధైర్యపడొద్దు.. మీకు కచ్చితంగా భవిష్యత్ ఉంటది. గెలిచినవారికి బాధ్యత ఉంటది. పార్టీ అందరిని కడుపులో పెట్టుకొని చూసుకుంటదికాంగ్రెస్ పాలన అంత సగం సగం, ఆగమాగం.. రైతు బంధు అన్నారు రెండు పంటలకు ఇచ్చారు రెండు పంటలకు ఎగ్గొట్టారు. బోనస్ బోగస్, బతకమ్మ చీరలు సగం సగం. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అన్నారు.. మండలానికి ఒక్క ఊరు అన్నారు ఒక్కసారి ఇచ్చి బంద్ చేసారు. రాజీవ్ యువవికాసం అన్నారు.. వికసించక ముందే వాడిపోయింది. కొత్త పథకాలు దేవుడెరుగు కెసిఆర్ తెచ్చిన పథకాలను బంద్ చేసారు. కళ్యాణ లక్ష్మిలో తులం బంగారం అన్నారు.. బంగారం ధర లక్ష అయ్యింది కానీ తులం మాత్రం రాలేదు. కేసీఆర్ లగ్గానికి చెక్కు ఇస్తే ఈ రేవంత్ పాలనలో పిల్ల పుట్టాక చెక్కులు ఇచ్చే పరిస్థితి. కళ్యాణ లక్ష్మి కింద రూ. 900 కోట్లు బకాయిపడ్డ ప్రభుత్వం. కేసీఆర్ హయాంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ పిల్లల చదువుల కోసం ఏడాదికి రూ. 2500 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విడుదల చేసేది. రేవంత్ వచ్చాక రూ. 9000 కోట్లు పెండింగ్‌లో పెట్టి పిల్లల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాడు. తండాలను గ్రామ పంచాయతీలుగా చేసి 10% రిజర్వేషన్ ఎస్టీలకు కేసీఆర్ ఇస్తే.. రేవంత్ రెడ్డి ఎస్టీలను మోసం చేస్తున్నాడు. ద్రోహం చేస్తున్నాడు. లంబాడాలకు ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వలేదు ఈ కాంగ్రెస్ పార్టీ. ఒక్క నర్సాపూర్ నియోజకవర్గ తండాలకే రోడ్ల కోసం రూ. 54 కోట్లను నాడు కేసీఆర్ గారు మంజూరు చేసారు. ఎన్నికలు ఎప్పుడు జరిగిన వచ్చేది బీఆర్ఎస్ పార్టీ.. సీఎం అయ్యేది మన కేసీఆర్ .వందల కోట్లు పెట్టి రేవంత్ రెడ్డి ఫుట్‌బాల్ ఆడితే ప్రజలకు ఏం వస్తది. నీతో తెలంగాణ ప్రజలు ఫుట్‌బాల్ ఆడే రోజు తొందరలోనే ఉన్నది. అందాల పోటీ మీద, ఫుట్‌బాల్ మ్యాచుల మీద ఉన్న ప్రేమ రైతులకు ఎరువుల సరఫరా మీద లేకపోవడం బాధాకరం. రైతులను యాప్.ల పేరుతో ఇబ్బంది పెడుతున్నారు. కేసీఆర్ హయాంలో ఏ యాప్ లేకుండానే సరఫరా చేసాము కదా ఇప్పుడు ఎందుకు ఇవన్నీ.

కేసీఆర్ హయాంలో రైతులకు 24 గంటలు కరంటు ఇస్తే రేవంత్ హయాంలో 12 గంటలు కూడా సరిగా ఇవ్వడం లేదు. చెప్పేది 24 గంటలు ఇచ్చేది 12 గంటలు. రుణమాఫీ అంటిరి చెయ్యకపోతిరి.. అకౌంట్లు ఎన్.పీ అవుతున్నాయి.. సిబిల్ పడిపోతుంది. రేవంత్ రెడ్డిని నమ్మినందుకు ఇండ్లకు, పిల్లల చదువులకు లోన్లు రాకుండా పోయే పరిస్థితి. దేవుళ్ళ, గుడులు, చర్చిల మీద ఒట్టేసి రుణమాఫీ చేస్తా అని దేవుళ్ళనే మోసం చేసినవాడికి ప్రజలను మోసం చెయ్యడం లెక్కనా: హరీష్ రావు అన్నారు.

## అన్ని కాలాల్లో ఆయిల్ పామ్ సాగు సాధ్యం

**- నాలుగో ఏడాది నుంచే లాభాల పంట**

**ఇంచార్జి జిల్లా కలెక్టర్ : గరిమా అగ్రవాల్**

**- బోయినిపల్లిలో అవగాహన సదస్సు - రైతుల ఆసక్తి**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలంలో ఆయిల్ పామ్ సాగు రైతులకు స్థిర ఆదాయ మార్గంగా మారుతుందని ఇంచార్జి జిల్లా కలెక్టర్ గరిమా అగ్రవాల్ అన్నారు. ఉద్యానవన, వ్యవసాయ, సహకార శాఖల సమన్వయంతో బోయినిపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. సదస్సులో ముందుగా ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులు తమ అనుభవాలను వెల్లడించారు. మొక్కలపై సబ్సిడీ, అంతర పంటల సాగుకు ప్రోత్సాహం, ఎరువులు – యాజమాన్యానికి వార్షిక ఆర్థిక సహాయం అందుతోందని చెప్పారు. తక్కువ కూలీలతోనే సాగు సాధ్యమవుతుందని వివరించారు. అనంతరం ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ వంటనూనె దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును విస్తరిస్తోందన్నారు. జిల్లాలోనే నర్సరీ ఉండటంతో పాటు ఒక్క మొక్కకు రూ. 193 సబ్సిడీ ఇస్తున్నామని, రైతులు కేవలం రూ. 20 చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు కూడా సబ్సిడీపై అందజేస్తామని చెప్పారు. నాలుగో ఏడాది నుంచి దిగుబడి ప్రారంభమవుతుందని, ప్రస్తుతం టన్నుకు సుమారు రూ. 19 వేల ధర ఉందని పేర్కొన్నారు. పంట విక్రయానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని, సిద్ధిపేట జిల్లా నర్మెట్ట వద్ద ఉన్న ఫ్యాక్టరీకి సరఫరా సౌకర్యం ఉందన్నారు. ఇతర పంటలతో పోలిస్తే లాభాలు ఎక్కువగా ఉండటంతో పాటు అటవీ జంతువుల బెడద తక్కువగా ఉంటుందని స్పష్టం చేశారు. అంతర పంటలుగా కూరగాయలు, ఇతర పంటలు సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి గల రైతులను ఫ్యాక్టరీ సందర్శనకు తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు.

### రైతుల ముందడుగు

సదస్సు ముగిసిన వెంటనే పలువురు రైతులు ఆయిల్ పామ్ సాగుకు ముందుకు వచ్చి, సాగు చేయనున్న ఎకరాల వివరాలు నమోదు చేసుకున్నారు. ముందుకు వచ్చిన రైతులను ఇంచార్జి కలెక్టర్ అభినందిస్తూ, మరింత మంది ఈ పంట వైపు దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి శరత్ బాబు, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, తహసిల్దార్ నారాయణరెడ్డి, బోయినిపల్లి సర్పంచ్ నల్ల మోహన్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి బండి సమక్షంలో బీజేపీలోకి కాసారం ఉపసర్పంచ్ చేరిక



గంగాధర (ప్రశ్న న్యూస్) కరీంనగర్ జిల్లా,గంగాధర మండలం, కాసారం గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ బట్టు చంద్రశేఖర్ బీజేపీ మండల శాఖ అధ్యక్షులు పంజాల ప్రశాంత్ ఆధ్వర్యంలో బుధవారం అధికారికంగా బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ ఉపసర్పంచ్ చంద్రశేఖర్‌కు పార్టీ కండువా కప్పి బీజేపీ కుటుంబంలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ విధానాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు తనను ఆకర్షించాయని తెలిపారు. కాసారం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు పార్టీ శ్రేణులతో కలిసి పనిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఉపసర్పంచ్ చేరికకు శుభాకాంక్షలు తెలిపారు.

## పారదర్శక లావాదేవీలతో వ్యవసాయ మార్కెట్ నిర్వహణ

**- రైతులకు మెరుగైన సౌకర్యాలపై బోయినిపల్లి మార్కెట్ కమిటీ దృష్టి**

**- బోయినిపల్లి ఏఎంసీ చైర్మన్ : బోయిని ఎల్లేష్ యాదవ్ స్పష్టం**

**- బోయినిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నాల్గవ సాధారణ సమావేశం**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం నాల్గవ సాధారణ సమావేశం కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, బోయినిపల్లి గ్రామ సర్పంచ్ నల్ల మోహన్ తోపాటు డైరెక్టర్లు మెరుపుల మహేష్,గుడి శేఖర్ రెడ్డి,నీరటి ప్రదీప్, బాలాగోని వెంకటేష్, అద్దంకి రమేష్, రోమాల అజయ్ పాల్గొన్నారు. అలాగే మార్కెట్ కార్యదర్శి పి. రమణతో పాటు ఇతర సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ మాట్లాడుతూ రైతులే కేంద్రంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యకలాపాలు సాగాలని అన్నారు. రైతులు తమ పంటలను న్యాయమైన ధరలకు విక్రయించుకునేలా అవసరమైన అన్ని మౌళిక వసతులను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు. మార్కెట్ యార్డులో పారదర్శకతతో కూడిన లావాదేవీలు జరిగేలా, క్రమశిక్షణ పాటిస్తూ పాలకవర్గం సమిష్టిగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. రైతుల సమస్యల పరిష్కారానికి కమిటీ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని, మార్కెట్ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ అభివృద్ధి పనులు, రైతులకు కల్పించాల్సిన సౌకర్యాలు, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

## మాతృవియోగానికి ఓదార్పు - మానవత్వాన్ని చూపిన మిత్రబృందం

**- సుఖదుఃఖాల్లో కలిసి...1998-99 ఎస్సెస్సీ బ్యాచ్ మిత్రుల ఆదర్శం**

**- క్వింటాల్ బియ్యం వితరణ - పరామర్శ - ప్రగాఢ సంతాపం**





బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) 1998– 99 విద్యా సంవత్సరం ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన మిత్రబృందం బుధవారం బోయినిపల్లి మండల కేంద్రానికి చెందిన తమ మిత్రుడు ఊరగొండ లక్ష్మణ్ కుటుంబానికి అండగా నిలిచింది. లక్ష్మణ్ మాతృమూర్తి వెంకటలక్ష్మీ అనారోగ్యంతో ఇటీవల స్వర్గస్థులైన నేపథ్యంలో, కీ.శే. వెంకటలక్ష్మీ పెద్దకర్మను పురస్కరించుకొని మానవతా దృక్పథంతో మిత్రబృందం క్వింటాల్ బియ్యాన్ని వితరణగా అందజేసింది. అనంతరం లక్ష్మణ్ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ "విద్యాభ్యాస కాలంలో ఏర్పడిన మిత్రబంధం జీవితాంతం కొనసాగాలి. సుఖంలోనే కాదు, దుఃఖంలోనూ మిత్రునికి అండగా నిలవడమే నిజమైన స్నేహం. లక్ష్మణ్ కుటుంబానికి ఈ కష్ట సమయంలో మావంతు సహాయం అందించడం మా బాధ్యత. కీ. శే.వెంకటలక్ష్మీ ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో 1989–99 మిత్రులు సతీష్, సత్య, దూస కిషోర్, అంజయ్య, అరుణ్, రామకృష్ణ, శ్రీనివాస్, మహేందర్, శ్రీకాంత్, ఏ. శ్రీనివాస్, పచ్చునూరి దామోదర్, రామానుజం, సావనపల్లి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# చాప కింద నీరులా అక్రమ వడ్డీ దందా

- గ్రేటర్ హైదరాబాద్‌లో చిరు వ్యాపారుల బతుకులతో చెలగాటం
- 10 శాతం వడ్డీ భారం - రోడ్డుపాలవుతున్న చిరు వ్యాపారులు
- 3 శాతం వడ్డీ చాలు - 10 శాతం వడ్డీ వద్దంటున్న వ్యాపారులు
- పోలీసు అధికారుల పర్యవేక్షణ ఎక్కడ.?
- వడ్డీ వ్యాపారుల నిఘా కోరుతున్న చిరు వ్యాపారులు
- అప్పుల ఊబిలో చిరు వ్యాపారులు
- గ్రేటర్ హైదరాబాద్ లో నిశ్శబ్ద ఆర్థిక ఉగ్రవాదం



గజ్జెల శ్రీనివాస్
( ప్రశ్న న్యూస్ ప్రతినిధి)




గ్రేటర్ హైదరాబాద్ లో అక్రమ వడ్డీ వ్యాపారం నిశ్శబ్దంగా, కానీ అత్యంత ప్రమాదకరంగా విస్తరిస్తోంది. చిన్నచిన్న దుకాణాలు, ఫుట్‌పాత్‌పై జీవనం సాగించే చిరు వ్యాపారులే ఈ దందాకు ప్రధాన లక్ష్యంగా మారుతున్నారు. అత్యవసర అవసరాలు, అనారోగ్యాలు, వ్యాపార నష్టాల సమయంలో సహాయం పేరుతో దగ్గరై, నెలకు 10 శాతం వడ్డీ వసూలు చేస్తూ వారి జీవితాలను అప్పుల చక్రంలో బంధిస్తున్నారు.

### అవసరమే ఆయుధం··· అప్పే ఉచ్చుగా

రోజువారీ సంపాదన మీద ఆధారపడే చిరు వ్యాపారులకు బ్యాంకు రుణాలు అందని పరిస్థితిని వడ్డీ వ్యాపారులు తమ ఆయుధంగా మలుచుకుంటున్నారు. "ఈరోజు డబ్బు కావాలా.? ఇప్పుడే ఇస్తాం" అంటూ నమ్మబలికి అప్పు ఇస్తూ ఆపై వడ్డీ భారంతో నెమ్మదిగా ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు.

### ఒక్కరోజు ఆలస్యం... రెట్టింపు వడ్డీ

చెల్లింపులో ఒకరోజు ఆలస్యం జరిగితేనే వడ్డీని రెట్టింపు చేయడం, అదనపు జరిమానాలు విధించడం పరిపాటిగా మారింది. అసలు కంటే వడ్డీ ఎక్కువయ్యే దశకు చేరుకుంటోంది. కొంతమంది వ్యాపారులు రోజూ సంపాదించిన డబ్బు మొత్తం వడ్డీకే వెచ్చించాల్సిన దుస్థితి. డబ్బు ఇవ్వలేకపోతే బెదిరింపులే మార్గం వడ్డీ చెల్లించలేకపోతే మాటల దాడి, బహిరంగ అవమానాలు, బెదిరింపులు మొదలవుతున్నాయని మనుషుల రక్తం తాగే విధంగా వడ్డీ వ్యాపారం సాగుతుందని బాధితులు చెబుతున్నారు. "వ్యాపారం చేస్తున్న చోటికే వచ్చి నడ్డి ఇరుస్తున్నారు" అంటూ చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వేధింపుల వల్ల కుటుంబాల్లో కలహాలు, మానసిక ఒత్తిడి పెరుగుతోంది.

### అధిక వడ్డీలతో కుప్పకూలుతున్న జీవనోపాధి

వడ్డీ భారాన్ని భరించలేక అనేక మంది తమ దుకాణాలను మూసివేసి రోడ్డుపాలవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. కొందరు పరికరాలు అమ్ముకుంటున్నారు, మరికొందరు స్థలాలు వదిలి వెళ్లిపోతున్నారు. ఇది కేవలం ఆర్థిక నష్టం కాదు, జీవన భద్రతకే ముప్పుగా మారుతుంది.

### 10 శాతం కాదు... 3 శాతం చాలు చిరు వ్యాపారులు స్పష్టంగా చెబుతున్నారు

"10 శాతం వడ్డీ వద్దు, 3 శాతం వడ్డీ చెల్లించడానికి సిద్ధం. చట్టబద్ధమైన రుణాలు కావాలి."ప్రభుత్వం, బ్యాంకులు, మైక్రోఫైనాన్స్ సంస్థలు ముందుకొస్తే అక్రమ వడ్డీ వ్యాపారాల అవసరమే ఉండదని వారు అభిప్రాయపడుతున్నారు.

### పోలీసు అధికారుల చర్యలు తప్పనిసరి

ఈ అక్రమ వట్టి దందాపై పోలీసులు, విజిలెన్స్ అధికారులు కఠినంగా స్పందించాలి అని వ్యాపారుల విజ్ఞప్తి. ఫుట్‌పాత్, చిన్న దుకాణాల ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా, ఫిర్యాదులకు తక్షణ స్పందించి అధిక వడ్డీ వ్యాపారులపై కేసులు నమోదు చేయాలని కోరుతున్నారు.

### పరిష్కార మార్గాలు ఏవి.?

చిరు వ్యాపారులకు తక్కువ వడ్డీతో తక్షణ రుణాలు పొందేలా బ్యాంకు రుణాల్లో సులభ నిబంధనలతో అక్రమ వడ్డీ వ్యాపారాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించిబాధితులకు న్యాయ రక్షణ దిశగా అవగాహన కల్పించాలి.

### తక్షణ చర్యలు..

గ్రేటర్ హైదరాబాద్‌లో చాప కింద నీరులా సాగుతున్న అక్రమ వడ్డీ వ్యాపారం 10% వడ్డీ వసూలు చేస్తూ ఇప్పుడు సామాజిక విషంలా మారింది. చిరు వ్యాపారుల కష్టార్జితంపై పెనుభారం మోపుతున్న ఈ దందాను అడ్డుకోకపోతే, రేపు మరిన్ని కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం తప్పదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు మేల్కొని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# నిర్మాణాల వద్ద సంఘాల నాయకుల హల్చల్



- ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, కంటెస్టెడ్ సభ్యులు ఎవరికి వారు వాటాలు పంచుకుంటున్నారు
- అక్రమ నిర్మాణాల వద్ద వసూళ్ల కోసం వారిదే రాజ్యం
- నిర్మాణాలు చేపట్టే నిర్మాణదారులకు సంఘాల నాయకుల తలనొప్పి
- జిహెచ్ఎంసి లో ఫిర్యాదు చేయాలి, అధికారుల సహకారంతో వసూళ్లు చేయాలి
- సంఘాల నాయకులు ఫిర్యాదు చేయగానే సెటిల్మెంట్ చేసుకోండి అంటు వత్తిడి చేస్తున్న మున్సిపల్ అధికారులు
- అక్రమాలపై పత్రికలో కథనాలు వచ్చిన స్పందన ఉండదు, కానీ సంఘాల పేరుతో ఫిర్యాదులు వస్తే అధికారుల హడావుడే వేరు
- సంఘాల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న వారిపై పోలీసుల నిఘా ఉండదా.?
- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రోజురోజుకు పెరిగిపోతున్న సంఘాల నాయకుల వసూల్ దందా

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాదులో ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టే నిర్మాణదారులకు తలనొప్పులుగా మారుతున్న సంఘాల నాయకుల వ్యవహారం. ప్రజాసంఘాల నాయకులమని, స్వచ్ఛంద సంస్థ నాయకులమని, కుల సంఘాల నాయకులమని, కంటెస్టెడ్ కార్పొరేటర్, ఎమ్మెల్యేలమని, పార్టీ నాయకులమని, పార్టీ డివిజన్ అధ్యక్షులమని ఇలా ఎవరికి తోచిన విధంగా వారు ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టే నిర్మాణదారులను భయ భ్రాంతులకు గురిచేసి, మాకు కావలసింది ముట్ట చెబితేనే మీ నిర్మాణాలు పూర్తవుతాయని లేదు కాదు అంటే మీ నిర్మాణాలు జరగవని, మీ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేస్తామని, కొందరైతే ఫిర్యాదు చేసి మున్సిపల్ అధికారులు సిబ్బందితో నిర్మాణదారులకు ఫోన్ చేయించుకొని భయభ్రాంతులకు గురి చేస్తూ లక్షలలో వసూళ్లకు పాల్పడుతున్నారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులు ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అనుమతుల విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టే నిర్మాణదారులకు టౌన్ ప్లానింగ్ అధికారుల నుండి ఫోన్లు చేపించుకొని వారికి కావాల్సింది ఇవ్వాలని టౌన్ ప్లానింగ్ అధికారులు తెలుపుతున్నారని కాదు, కుదరదు అంటే మీ నిర్మాణాలను కూల్చి వేయిస్తామని టౌన్ ప్లానింగ్ అధికారులు కూడా సంఘాల నాయకులతో చేతులు కలిపి నిర్మాణదారులను భయభ్రాంతుల గురి చేస్తున్నారు. స్థానిక రాజకీయ నాయకుల పలుకుబడితో కుల సంఘాల నాయకులకు రాజకీయ నాయకులు పూర్తి మద్దతు ఇవ్వడంతో ఆడిందే ఆటగా, పాడిందే పాటగా తమకు కావలసిన వసూళ్లు చేయించుకుంటున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.


### అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోరు..

నిర్మాణాలు చేపట్టే వారికి సిబ్బంది, అధికారులే ఫోన్ చేసి సెటిల్మెంట్ చేసుకోవాలని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఉన్నతాధికారులకు ఈ విషయం చెప్పిన పట్టించుకోవడంలేదని గ్రేటర్ హైదరాబాదులో రాజకీయ నాయకులు, కుల సంఘాల నాయకులు చేతులు కలిపి అక్రమ నిర్మాణల వద్ద దారుణంగా దోచుకుంటున్నారని, వీరికి టౌన్ ప్లానింగ్ అధికారులు పూర్తిగా సహకరిస్తున్నారని ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టిన పాపానికి సంఘాల నాయకుల అక్రమ వసూలతో ఆర్థికంగా నష్ట పోతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంఘాల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఇలాంటి వారిపై పోలీసులు, పోలీసు ఉన్నత అధికారులు, ఇంటెలిజెన్స్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి కఠిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# తైవాన్ లో భారీ భూకంపం..
## కుప్పకూలిన భవనాలు

**తైవాన్** (ప్రశ్న న్యూస్) తైవాన్ లో భారీ భూకంపం సంభవించింది. ఆగ్నేయ తీరప్రాంత కౌంటీ అయిన టైటుంగ్ లో బుధవారం భూమి కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 6.1గా నమోదైంది. ఈ ప్రభావంతో రాజధాని తైపీ లో భవనాలు కుప్పకూలిపోయాయి. అయితే, ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ ప్రకారం.. భూకంపం భూమికి 11.9 కిలోమీటర్ల లోతులో నమోదైంది. స్థానిక మీడియా సంస్థ తైవాన్ న్యూస్ ప్రకారం.. భూకంపం కేంద్రం టైటుంగ్ కౌంటీ హాల్‌కు ఉత్తరాన 10 కిలోమీటర్ల దూరంలో ఉంది.



# కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు
## - తీవ్రంగా స్పందించిన కేటీఆర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి అహంకారంతో మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోస్గిలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందిస్తూ, 2028లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడం ఖాయమని అన్నారు. నీటి ద్రోహంపై సమాధానం చెప్పలేక ఇష్టారీతిన మాట్లాడుతున్నారని విమర్శించారు. నదీ జలాల హక్కులను కాపాడటం చేతకాని అసమర్థుడు అహంకారంతో మాట్లాడుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాలమూరు ప్రాజెక్టు గొంతుకోసి సొంత జిల్లానే మోసం చేస్తున్నాడని ఆరోపించారు. అది చాలదన్నట్లుగా కేసీఆర్‌పై ఏది పడితే అది మాట్లాడుతున్నారని అన్నారు. సభ్యత, సంస్కారం లేని నీచమైన రేవంత్ రెడ్డి ప్రవర్తనను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. ప్రజలు ఛీకొడుతున్నా ఇంకా మారవా అని ఎద్దేవా చేశారు. శాసనసభతో పాటు జనసభలోనూ కాంగ్రెస్ పార్టీ జలద్రోహాన్ని ఎండగడతామని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో వందేళ్ల వరకు కాంగ్రెస్ పార్టీకి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, సందర్భం వచ్చినప్పుడు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# ఫిరాయింపులపై చర్చల నడుమ దానం నాగేందర్ కీలక ప్రకటన
## - తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని స్పష్టీకరణ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపుల చర్చలు ముదురుతున్న వేళ, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కీలక ప్రకటన చేశారు. తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని స్పష్టం చేసిన ఆయన, ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎవరు? వారు ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారు? అన్న విషయాలు తనకు తెలియవని అన్నారు. "నేను ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ గెలుస్తుంది" అంటూ దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎంఐఎం కలిసి మొత్తం 300 డివిజన్లలో విజయం సాధిస్తాయని ఆయన ధీమా వ్యక్తం వేశారు. గ్రేటర్ హైదరాబాద్ అంతటా విస్తృతంగా ప్రచారం చేస్తానని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని తెలిపారు. ఇటీవల బీఆర్ఎస్ తరఫున గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ గులాబీ పార్టీ పోరాటం చేస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా ఎమ్మెల్యేలు తాము ఇంకా బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నామని చెబుతున్నారు. అయితే, ఈ పరిణామాలకు భిన్నంగా దానం నాగేందర్ మాత్రం బహిరంగంగా తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నానని అంగీకరించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# తెలంగాణ హై కోర్టు కేంద్ర ప్రభుత్వ అడ్వకేట్ గా ఎ.ఎస్.భాస్కర్ గిరి నియామకం



సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన ప్రముఖ హైకోర్టు న్యాయవాది ఎ.ఎస్.భాస్కర్ గిరి ని తెలంగాణ హై కోర్టు కేంద్ర ప్రభుత్వ అడ్వకేట్ గా నియమితులయ్యారు. కేంద్ర ప్రభుత్వం న్యాయ శాఖ చేసిన ఓ ప్రకటన ద్వారా విడుదల చేశారు. తన పై నమ్మకం ఉంచి నియమించినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. సికింద్రాబాద్ కోర్ట్ ఆవరణలో న్యాయవాదులు తమ మిత్రుడు భాస్కర్ గిరి నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# 20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం
## - స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనపై చంద్రబాబు సమీక్ష



అమరావతి (ప్రశ్న న్యూస్) స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్య సాధన కోసం రూపొందించిన పది సూత్రాలను పది మిషన్లుగా స్వీకరించి పనిచేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. పాలనలో వేగాన్ని పెంచి, ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు ప్రతి ప్రభుత్వ శాఖ పనితీరును తెలిపే ప్రత్యేక సూచికలను (ఇండికేటర్లు) సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. సచివాలయంలో ఇవాళ ఆయన స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలు, పది సూత్రాల అమలుపై నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే అత్యంత ప్రాధాన్యతాంశమని స్పష్టం చేశారు. నైపుణ్యం పోర్టల్ ద్వారా ఉద్యోగాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని సూచించారు. జీరో పావర్టీ మిషన్‌లో భాగంగా రాష్ట్రంలోని 30 లక్షల పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా కలిగే ప్రయోజనాన్ని అంచనా వేయాలని, ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు. నీటి భద్రతను కీలక మిషన్‌గా పరిగణించి, నీటి వనరుల సమర్థ వినియోగంపై దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు తెలిపారు. నీటి ఆడిట్ నిర్వహించాలని, వివాదాలకు తావులేకుండా చూడాలని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు సస్యశ్యామలంగా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు. రైతుల ఆత్మహత్యల నివారణకు పటిష్టమైన కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. 'మేడ్ ఇన్ ఆంధ్ర' బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తంగా ప్రోత్సహించాలని, అరకు కాఫీ తరహాలో రాష్ట్ర ఉత్పత్తులకు నాణ్యతతో కూడిన గుర్తింపు తీసుకురావాలని సీఎం సూచించారు. రవాణా వ్యయాన్ని తగ్గించేందుకు లాజిస్టిక్స్ మాస్టర్ ప్లాన్, స్వచ్ఛాంధ్ర కోసం సర్క్యులర్ ఎకానమీ, సాంకేతికత వినియోగంతో పౌర సేవలను సులభతరం చేయడం వంటి అంశాలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, వివిధ శాఖల

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588